మార్నింగ్ కాఫీ విత్ హాట్ న్యూస్‌తో...! మీ

# డ్రీమ్ టైమ్స్

తెలుగు దిన పత్రిక

సోమవారం 9-03-2026
పేజీలు: 8 వెల: రూ.2/-

సంపుటి:5 సంచిక 139

Published from Kurnool circulated all over Andhra Pradesh and Telangana All District



**విలేకరులు కావలెను**




తెలంగాణ ,ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా డ్రీమ్ టైమ్స్ దినపత్రికలో బ్యూరో, మండలాల రిపోర్టర్ గా పని చేయుటకు జిల్లాల, నియోజకవర్గ స్థాయిలో ఉత్సాహవంతులైన యువతి ,యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును

8500066609


# మూడోసారి కప్పు కైవసం








## ఫైనల్లో న్యూజిలాండ్‌పై ఏకపక్ష విజయం

- టీ20 ప్రపంచకప్ టైటిల్ భారత్ వశం
- శాంసన్, అభిషేక్, కిషన్ ధనాధన్
- టి20 ప్రపంచకప్ ఫైనల్లో ఘన విజయం
- 255 పరుగుల భారీ స్కోరు, 159కే కివీస్ ఆలౌట్

**అహ్మదాబాద్ 08 మార్చి డ్రీమ్ టైమ్స్:**
ఐసిసి 2026 టి-20 ప్రపంచకప్ టీమ్ ఇండియా సొంతమైంది. ఆదివారం అహ్మదాబాద్‌లో జరిగిన ఫైనల్లో న్యూజిలాండ్‌పై భారత్ 96 పరుగుల తేడాతో ఏకపక్ష విజయం సాధించింది. 256 పరుగుల ఛేదనలో న్యూజిలాండ్ కనీస పోటీ ఇవ్వలేదు. ఓపెనర్ టిమ్ సీఫర్ట్ (52, 26 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్స్‌లు), కెప్టెన్ మిచెల్ శాంట్నర్ (43, 35 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్స్‌లు) మినహా ఇతర బ్యాటర్లు అందరూ విఫలమయ్యారు. భారత పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా (4/15), అక్షర్ పటేల్ (3/27) ఛేదన

-మిగతా 3 లో



## ఆస్పత్రుల్లో ఏఐ సేవలు

- ఆస్పత్రుల్లో ఏఐ సేవలుపైలట్‌గా 18 ప్రభుత్వ ఆస్పత్రుల్లో వినియోగం: మంత్రి సత్యకుమార్

**అమరావతి, 08 మార్చి డ్రీమ్ టైమ్స్:**
కృత్రిమ మేధ(ఏఐ) వినియోగంతో వైద్య సేవల్లో విప్లవాత్మక మార్పులకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. రాష్ట్రంలో ఎంపి క చేసిన 18 ప్రభుత్వ ఆస్పత్రుల్లో 18 మంది ఇన్నోవేటర్లు ఏకకాలంలో 40 పరికరాల ద్వారా వైద్య సేవల్లో కీలకమైన స్క్రీనింగ్, కన్ఫర్మేషన్ పరీక్షలు చేస్తున్నారన్నారు. దీనివల్ల తక్కువ సమయంలోనే వ్యాధి నిర్ధారణ అవుతుందని, దీంతో రోగులకు చికిత్స అందించేందుకు వైద్యులకు సమయం ఆదా అవుతుందని చెప్పారు. విశాఖపట్నం, అనంతపురం, గుంటూరు, కాకినాడ ప్రభుత్వాస్పత్రుల్లో, సిద్ధార్థ మెడికల్ కాలేజీ, పార్వతీపురం,

-మిగతా 3 లో




## యుద్ధంలో క్లస్టర్ బాంబులు

- ఇరాన్‌పై ఇజ్రాయిల్ ఆరోపణలు
- టెహ్రాన్ ప్రతిదాడులను జీర్ణించుకోలేని టెల్‌అవీవ్
- అందుకే ఇలాంటి ఆరోపణలంటున్న విశ్లేషకులు
- గాజాపై రెండేండ్లుగా సాగించిన నరమేధం దేనికి నిదర్శనం?
- ఇజ్రాయిల్‌ది ద్వంద్వ వైఖరి అని వెల్లడి

**న్యూఢిల్లీ**
ఇరాన్‌పై దాడులకు దిగి, మధ్యప్రాచ్యంతో పాటు ప్రపంచాన్ని గందరగోళానికి గురిచేస్తున్నాయి అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు. ఇరాన్ సుప్రీం నేత అయతుల్లా అలీ ఖమేనీని చంపేసి, అమాయకపు పౌరుల ప్రాణాలను తీసుకుంటున్నాయి. అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘిస్తూ, ఇరాన్ సార్వభౌమాధికారాన్ని దెబ్బతీస్తూ, ఆ దేశ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకొని మరీ యుద్ధానికి దిగాయి. అమెరికాతో కలిసి ఈ విధమైన దారుణమైన దాడులకు దిగిన ఇజ్రాయిల్ ఇప్పుడు ఒక ఆశ్చర్యకరమైన ఆరోపణ చేస్తున్నది. యుద్ధంలో భాగంగా ఇరాన్ తమపై క్లస్టర్ మ్యూనిషన్స్‌ను ఉపయోగించిందని ఆరోపిస్తోంది. మొన్నటి వరకు గాజాపై రెండేండ్లకు పైగా దాడులు చేసి వేలాది మంది ప్రాణాలను తీసుకుంది ఇజ్రాయిల్. నేడు ఇరాన్‌పై కూడా దారుణ చర్యలకు ఒడిగడుతోంది. దీంతో ఆత్మరక్షణ చర్యలో భాగంగా ఇరాన్ చేస్తున్న ప్రతిదాడులను మాత్రం ఇజ్రాయిల్ సహించలేక పోతోందనీ, ఇది ఆ దేశం ద్వంద్వ వైఖరికి అద్దం పడుతోందని విశ్లేషకులు చెప్తున్నారు.

-మిగతా 3 లో

## మహిళల అభ్యున్నతికి కూటమి కృషి

### కుటుంబంలో ఐదారుగురుంటే ట్రిపుల్ బెడ్రూమ్ ఇల్లు

- అవసరమైతే ఒక పెన్షన్ ఎక్కువగా ఇస్తాం
- ఇంట్లో 10 మంది ఉంటే 60 కేజీల బియ్యం
- ఈ ఏడాది 5 లక్షల మంది మహిళా పారిశ్రామికవేత్తలను సిద్ధం చేస్తాం
- రౌడీలు వస్తే రుద్రమదేవిలా ఎదురు నిలవండి
- మహిళా దినోత్సవంలో సీఎం చంద్రబాబు

**గుంటూరు, 08 మార్చి డ్రీమ్ టైమ్స్:**
"పెద్ద కుటుంబమే మనకు రక్ష. ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహకాల్లో పెద్ద కుటుంబాలకే ప్రాధాన్యం ఇస్తాం. ఇంట్లో ఐదారుగురు ఉంటే ట్రిపుల్ బెడ్రూమ్ ఇల్లు కట్టించి ఇస్తాం. అవసరమైతే పెన్షన్ కూడా ఒకటిగా ఎక్కువగా ఇస్తాం. ఇంట్లో పది మంది ఉంటే 60 కేజీల వరకూ రేషన్ ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తాం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాజధాని అమరావతిలోని పరేడ్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. దాదాపు 10 వేల మంది మహిళలు పాల్గొన్న ఈ వేడుకల్లో ఏర్పాటు చేసిన ర్యాంపుపై నడుస్తూ మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు.

-మిగతా 3 లో




## ఇస్లామిక్ నాటో' కూటమి దిశగా అడుగులు..?



- పశ్చిమాసియా ఉద్రిక్తతల వేళ.. పాక్, సౌదీ మధ్య చర్చలు సౌదీ రక్షణ మంత్రితో
- పాకిస్తాన్ సీడీఎఫ్ ఆసిమ్ మునీర్ భేటీ
- ఇరాన్ దాడుల నేపథ్యంలో భద్రతా పరిస్థితులపై చర్చ

**రియాద్:**
పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం తీవ్రమవుతున్న సమయంలో పాకిస్తాన్, సౌదీ అరేబియా మధ్య భద్రతా చర్చలు ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి. ఇరాన్‌లో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో పాకిస్తాన్ సైన్యాధిపతి (చీఫ్ ఆఫ్ డిఫెన్స్ ఫోర్సెస్) ఫీల్డ్ మార్షల్ సయ్యద్ ఆసిమ్ మునీర్ సౌదీ అరేబియాకు వెళ్లి అక్కడి రక్షణ మంత్రి ప్రిన్స్ ఖాలిద్ బిన్ సల్మాన్‌తో సమావేశమయ్యారు. దీంతో 'ఇస్లామిక్ నాటో' కూటమి ఏర్పాటు దిశగా అడుగులు పడుతున్నాయా? అన్న ఊహాగానాలు వెలువడుతున్నాయి. ప్రస్తుతం ఇరాన్, అమెరికా-ఇజ్రాయిల్ సంయుక్త దాడుల తర్వాత ఆ ప్రాంతంలో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి.

-మిగతా 3 లో

## రాష్ట్రపతిని అవమానించింది మీరే!

- ప్రధాని విమర్శలకు మమత కౌంటర్
- రాష్ట్రపతి నిలుచొని ఉన్న ఫొటో విడుదల



**కోల్‌కతా,08 మార్చి డ్రీమ్ టైమ్స్:**
పశ్చిమబెంగాల్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఇటీవలి పర్యటన ఆ రాష్ట్ర రాజకీయాల్లో సంచలనంగా మారింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్మును అవమానించారంటూ ప్రధాని మోదీ.. మమత సర్కార్‌పై మండిపడ్డారు. ప్రధాని వ్యాఖ్యలపై ఆదివారం సీఎం మమతా బెనర్జీ స్పందిస్తూ.. గతంలో రాష్ట్రపతికి సంబంధించి ఒక ఫొటోను విడుదల చేశారు.

-మిగతా 3 లో

## ఏఐను సమర్థవంతంగా వినియోగించాలి


### పోలీసు శాఖకు రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పిలుపు



- తెలంగాణ పోలీస్ రిట్రీట్-2026ను ప్రారంభించిన మంత్రి
- పాల్గొన్న డీజీపీ శివధర్‌రెడ్డి, మాజీ డీజీపీలు

**హైదరాబాద్ 08 మార్చి డ్రీమ్ టైమ్స్:**
మారుతున్న కాలానికి అనుగుణంగా నేర పరిశోధనలో అత్యాధునిక కత్రిమ మేధ(ఏఐ) సాంకేతికతను పోలీసు శాఖ సమర్థవంతంగా వినియోగించుకోవాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పిలుపునిచ్చారు. ఆర్‌బీవీఆర్ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీలో ఆదివారం నాడు 'తెలంగాణ పోలీస్ రిట్రీట్-2026' ను మంత్రి ప్రారంభించారు.

-మిగతా 3 లో



## నేటి నుంచి రెండో విడత పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

- స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం చర్చ
- విప్ జారీ చేసిన అధికార, ప్రతిపక్షాలు

**న్యూఢిల్లీ**
: పార్లమెంట్ రెండో విడత బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి తిరిగి కొనసాగనున్నాయి. ఏప్రిల్ 2 వరకు నిర్వహించనున్న ఈ సమావేశాలు పండుగలు, సెలవుల కారణంగా కేవలం 17 రోజులు మాత్రమే నిర్వహించే అవకాశం ఉంది. ఎజెండాలోని మొదటి అంశంగా లోకసభ స్పీకర్‌పై ప్రతిపక్షాలు పెట్టిన అవిశ్వాస తీర్మానం సహా కీలక అంశాలపై చర్చలు

-మిగతా 3 లో

## మండలి'కి కొత్త శోభ

### నూతన భవనాన్ని ప్రారంభించిన సీఎం



**హైదరాబాద్ 08 మార్చి డ్రీమ్ టైమ్స్:**
అసెంబ్లీ ప్రాంగణంలో ఆధునీకరించిన తెలంగాణ శాసనమండలి భవనాన్ని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. కొత్త సౌకర్యాలతో రూపుదిద్దుకున్న ఈ భవనం ప్రారంభోత్సవ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి డిప్యూటీ చైర్మెన్ బండ ప్రకాష్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు, శాసనసభా వ్యవహారాల శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్,

-మిగతా 3 లో

### సివిల్స్ ఫలితాల్లో

# ఇద్దరికి ఒకే ర్యాంక్!

**పేర్లు, రోల్ నంబరూ ఒక్కటే!**




**న్యూఢిల్లీ 08 మార్చి డ్రీమ్ టైమ్స్:**
యూపీఎస్సీ సివిల్ సర్వీస్ ఎగ్జామినేషన్-2025 తుది ఫలితాలు చాలా మంది యువతలో సంతోషం నింపగా, ఒక ర్యాంక్ విషయంలో గందరగోళాన్ని సృష్టించాయి. ఆకాంక్ష సింగ్ అనే పేరు గల ఇద్దరు మహిళలు తమకు 301 ర్యాంక్ వచ్చిందని ప్రకటించుకోవడమే దీనికి కారణం. వీరి ఇద్దరి రోల్ నంబర్ కూడా ఒకటే కావడం చర్చనీయాంశమైంది. వీరిలో ఒకరు వారణాసి(యూపీ),మరొకరు అర్రాహ్(బీహార్)కు చెందినవారు. వారణాసి అభ్యర్థిని తన యూపీఎస్సీ అడ్మిట్ కార్డ్, ఇంటర్వ్యూ కాల్ లెటర్‌ను సోషల్ మీడియాలో షేర్ చేసి ఫలితాల్లో పేర్కొన్న రోల్ నంబర్, ర్యాంక్ తనదేనని చెప్పారు. మరోవైపు జాతీయ స్థాయి ప్రతిష్ఠాత్మక పరీక్షలో ఒకే రోల్ నంబర్‌తో ఇద్దరికి ఒకే ర్యాంక్ ఎలా వస్తుందని సామాజిక మాధ్యమాల్లో చర్చ మొదలైంది.

## బంగారంపై దుబాయ్ డిస్కౌంట్



**దుబాయ్,08 మార్చి డ్రీమ్ టైమ్స్:**
ఇరాన్ యుద్ధం.. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా దుబాయ్‌లో గోల్డ్ ట్రేడర్స్ భారీ డిస్కౌంట్‌తో బంగారాన్ని అమ్మేందుకు సిద్ధమయ్యారు. అంతర్జాతీయ ధరలతో పోల్చితే ఔన్స్(28గ్రాములు) బంగారంపై 30 డాలర్ల (సుమారుగా రూ. 2,800) వరకు డిస్కౌంట్ ఇస్తున్నట్టు తెలిసింది. అయినప్పటికీ దీనిపట్ల భారతీయ కొనుగోలుదార్లు పెద్దగా ఆసక్తి చూపకపోవచ్చునని నిపుణలు చెబుతున్నారు. గల్ఫ్ దేశాల్లో విమాన రాకపోకలు, నౌకా రవాణా పూర్తిగా స్తంభించటంపై దుబాయ్‌లోని గోల్డ్ ట్రేడర్స్ ఆందోళన చెందుతున్నారు. అక్కడి మార్కెట్లో బంగారం అమ్మకాలు, తరలింపు ఓ పెద్ద సమస్యగా మారుతున్నది. బయ్యర్లు అనేకమంది కొత్త ఆర్డర్లను తీసుకోవటం లేదు. ఆర్డర్ డెలివరీపై అనిశ్చితి నెలకొన్నది. పెద్ద మొత్తంలో బంగారాన్ని తరలించేందుకు భారీ షిప్పింగ్ చార్జీలు, ఇన్సూరెన్స్ ఖర్చులు ఉండటంతో కస్టమర్లు వెనుకాడుతున్నారు. దీనిని అధిగమించేందుకు ట్రేడర్స్ డిస్కౌంట్ ప్రకటించినట్టు తెలుస్తున్నది.

## గల్ఫ్ నుంచి తిరిగొచ్చిన 52 వేల మంది భారతీయులు



**న్యూఢిల్లీ, 08 మార్చి డ్రీమ్ టైమ్స్:**
పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న క్రమంలో ఈ నెల 1 నుంచి 7 వరకు గల్ఫ్ దేశాల నుంచి 52 వేల మంది భారతీయులు సురక్షితంగా భారత్‌కు తిరిగి వచ్చేశారని భారత విదేశాంగ శాఖ (ఎంఈఏ) శనివారం తెలిపింది. వీరిలో 32,107 మంది ఇండియన్ ఎయిర్‌లైన్స్ ద్వారా, మిగిలిన వారు ఇతర వాణిజ్య, నాన్ షెడ్యూల్డ్ విమానాల ద్వారా భారత్‌కు చేరుకున్నారని తెలిపింది. గల్ఫ్ దేశాల్లో చిక్కుకుపోయిన భారతీయుల కోసం ఒక ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, బాధితులకు, వారి కుటుంబ సభ్యులకు దీని ద్వారా సహాయం అందజేస్తున్నట్టు ఎంఈఏ వివరించింది. అక్కడ ఉండిపోయిన భారతీయులు స్థానిక అధికారులు, దౌత్య కార్యాలయాలు, కాన్సులేట్లు ఇచ్చే మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని కోరింది.


### ఖమేనీ మృతికి ట్రంప్ తగిన మూల్యం చెల్లించుకోవాల్సిందే



**న్యూఢిల్లీ 08 మార్చి డ్రీమ్ టైమ్స్:**
ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ మృతికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని ఇరాన్ జాతీయ భద్రతా మండలి కార్యదర్శి డాక్టర్ అలీ లారిజాని హెచ్చరించారు. ఎక్స్ వేదికగా స్పందించిన లారిజాని.. ట్రంప్‌ను తాము వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. దాడుల్లో తమ నాయకుడితో పాటు అనేక మంది సామాన్య పౌరులు కూడా ప్రాణాలు కోల్పోయారని, ఇది సాధారణ విషయం కాదన్నారు. మరోవైపు, యుద్ధ వాతావరణం నేపథ్యంలో అనేక మంది అమెరికా సైనికులను తాము బంధించి జైళ్లలో ఉంచామని తెలిపారు. కేవలం ఆరుగురు సైనికులే చనిపోయారంటూ ట్రంప్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, వాస్తవానికి మృతుల సంఖ్య చాలా ఎక్కువగా ఉందని ఆరోపించారు.

# ఇండియా, చైనా ప్రత్యర్థులు కాదు.

**చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ**



**న్యూఢిల్లీ 08 మార్చి డ్రీమ్ టైమ్స్:**
భారత్, చైనా దేశాలు పరస్పరం ప్రత్యర్థుల్లా కాకుండా భాగస్వాములుగా ఉండాలని చైనా విదేశాంగ శాఖ మంత్రి వాంగ్ యీ వ్యాఖ్యానించారు. అదేవిధంగా ఒకరికొకరు ముప్పు అని భావించకుండా అభివృద్ధికి తోడ్పడే అవకాశంగా చూడాలన్నారు. వార్షిక మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన.. అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకోకుండా సంబంధాలను మెరుగుపర్చుకునే విషయానికి ఇరుదేశాలు కట్టుబడి ఉండాలని సూచించారు. 2024లో కజాన్ వేదికగా ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌ల సమావేశం జరిగిందని, అప్పటి నుంచి ఇరుదేశాల మధ్య సంబంధాల్లో కొత్త అధ్యాయం మొదలైందని వాంగ్ యీ చెప్పారు. గత ఏడాది తియాంజిన్‌లో ఇరుదేశాల నేతలు మరోసారి భేటీ అయిన తర్వాత మరింత మెరుగుదల కనిపించిందని తెలిపారు. ద్వైపాక్షిక వాణిజ్యం రికార్డు స్థాయికి చేరుకోవడం, ప్రజల మధ్య సంబంధాలు మెరుగుపడటం వంటివి ఇరుదేశాలకూ ప్రయోజనం చేకూర్చాయిని అన్నారు. భారత్, చైనా సత్సంబంధాలు, స్నేహాన్ని కాపాడుకోవాలని, సరిహద్దు ప్రాంతాల్లో శాంతి, స్థిరత్వాన్ని కొనసాగించాలని, అభివృద్ధిపై దృష్టి సారించాలని అభిప్రాయపడ్డారు. పొరుగు దేశాలుగా, గ్లోబల్ సౌత్ సభ్యులుగా, భారత్, చైనా దీర్ఘకాలిక సంబంధాలు కలిగి ఉన్నాయని వాంగ్ అన్నారు. పరస్పర విశ్వాసం, సహకారం అనేవి రెండు దేశాల అభివృద్ధికి ప్రయోజనకరంగా ఉంటాయని చెప్పారు. విభజనవాదం, ఘర్షణలు అభివృద్ధిని దెబ్బతీస్తాయని అన్నారు. 2020లో తూర్పు లద్దాఖ్‌లోని గల్వాన్ లోయలో ఇరు సైన్యాల మధ్య జరిగిన ఘర్షణతో ఇరుదేశాల మధ్య సంబంధాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. అయితే పలు దఫాలుగా చర్చలు జరిపిన భారత్, చైనా దేశాలు పరిస్థితులను చక్కదిద్దేందుకు చర్యలు తీసుకున్నాయి.

## జేడీయూలో చేరిన నితీష్ తనయుడు



**న్యూఢిల్లీ 08 మార్చి డ్రీమ్ టైమ్స్:**
బిహార్ సీఎం నితీష్ కుమార్ తనయుడు నిశాంత్ కుమార్ సొంత పార్టీ జేడీయూలో చేరారు. ఆదివారం పాట్నాలో జరిగిన ఒక కార్యక్రమంలో పార్టీ నేతల మధ్య జేడీయూ కండువా కప్పుకొన్నారు. జేడీయూ అధ్యక్షుడు, బిహార్ సీఎం అయిన నితీష్ కుమార్ త్వరలో రాజ్యసభకు వెళ్లబోతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పార్టీని ఎవరు నడిపిస్తారనే సందేహాలు వ్యక్తమయ్యాయి. పార్టీని నడిపించేందుకే నిశాంత్‌ను నితీష్ రాజకీయాల్లోకి తెచ్చినట్లు తెలుస్తోంది. జేడీయూలో చేరిన సందర్భంగా నిశాంత్ మాట్లాడుతూ .. పార్టీని నిలబెట్టేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. తన తండ్రి నితీష్ రాజ్యసభకు వెళ్లాలన్నది ఆయన సొంత నిర్ణయమని, దాన్ని గౌరవిస్తానన్నారు. ఆయన మార్గదర్శకత్వంలో రాష్ట్రం కోసం పనిచేస్తానని వెల్లడించారు. పార్టీ తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెడతానని చెప్పారు. ఈ నెల 16న రాజ్యసభ ఎన్నిక జరగనుంది. ఈ ఎన్నికలో నితీష్ గెలవడం లాంఛనమే. రాజ్యసభకు ఎంపీగా ఎన్నికైన తర్వాత నితీష్ బిహార్ సీఎం పదవికి రాజీనామా చేస్తారు.

### ట్రంప్‌జీ.. మీ పని

## మీరు చూసుకోండి

**- రాజ్యసభ సభ్యులు కమల్ హాసన్**



**చెన్నై 08 మార్చి డ్రీమ్ టైమ్స్:**
పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ.. రష్యా నుంచి చమురు కొనుగోలు చేసేందుకు 30 రోజుల పాటు భారత్‌కు అనుమతి ఇస్తున్నట్టు అమెరికా పేర్కొన్న విషయం తెలిసిందే. ఈ పరిణామంపై ప్రఖ్యాత నటుడు, రాజ్యసభ సభ్యులు కమల్ హాసన్ తీవ్రస్థాయిలో స్పందించారు. 'మేం స్వేచ్ఛాయుత, సార్వభౌమ దేశానికి చెందిన పౌరులం. మాకు విదేశాల నుంచి ఆదేశాలు అక్కర్లేదు. మీ సామర్థ్యాల మేరకు మీ పని మీరు చూసుకోండి" అని అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్‌ను ఉద్దేశించి ఆయన పేర్కొన్నారు. సార్వభౌమ దేశాలు పరస్పరం గౌరవించుకోవడం చాలా ముఖ్యమని పేర్కొంటూ ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. ఇంధన సరఫరా వ్యవస్థలో స్థిరత్వాన్ని కొనసాగించడానికి రష్యా చమురు కొనుగోలు చేసేందుకు భారత్‌కు 'తాత్కాలిక మినహాయింపు' ఇస్తున్నట్టు అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ పేర్కొన్న నేపథ్యంలో కమల్ హాసన్ ఈ విధంగా స్పందించారు.

# సంక్షోభ నివారణకు చైనా 'పంచసూత్రాలు'


**సైనిక చర్యలన్నీ తక్షణమే నిలిపేయాలని హితవు**



**బీజింగ్ 08 మార్చి డ్రీమ్ టైమ్స్:**
ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ యద్ధోన్మాద దాడులు కొనసాగిస్తున్న నేపథ్యంలో పశ్చిమాసియా ప్రాంతంలో నెలకొన్న సంక్షోభ పరిస్థితులను నివారించడానికి చైనా ఐదు సూత్రాలను ప్రతిపాదించింది. బీజింగ్‌లో 14వ జాతీయ పీపుల్స్ కాంగ్రెస్ నాలుగో సెషన్ తర్వాత ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ మాట్లాడుతూ ఈ వివరాలు వెల్లడించారు. ఇరాన్, మధ్యప్రాచ్యంలో పెరుగుతున్న ఉద్రిక్తతలను తగ్గించడానికి తాము దౌత్యపరమైన ఐదు కర్తవ్యాలను సూచిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. వీటిలో మొదటిది తక్షణమే శత్రుత్వాలను విరమించి అన్ని రకాల సైనిక చర్యలను నిలిపివేయాలని, ప్రాణనష్టాన్ని నివారించడం అత్యంత ప్రధానమని పేర్కొన్నారు. సైనిక బలంతో రాజకీయ సమస్యలను పరిష్కరించలేమని పునరుద్ఘాటించారు. ఇక రెండోది : ఇరాన్, ఇతర గల్ఫ్ దేశాల సరిహద్దులను, స్వతంత్రతను ఇతర దేశాలు గౌరవించాలని, బాహ్య శక్తుల జోక్యం ఉండరాదని హితవు పలికింది. మూడోది : అణువ్యాప్తిని అరకట్టిడానికి విస్తృత సంప్రదిం పులు, చర్చలు మాత్రమే సరైన మార్గమని పేర్కొన్నారు. నాలుగోది : హోర్ముజ్ జలసంధి వంటి కీలక వాణిజ్య మార్గాలను సురక్షితంగా ఉంచాలని సూచిం చింది. అంతర్జాతీయ ఇంధన సరఫరాకు ఎటువంటి ఆటంకం కలగకుండా చూడటం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ముఖ్యమని పేర్కొన్నారు. ఇక ఐదోవది : మదధ్యప్రాచ్య దేశాలు తమ భద్రత సమస్యలను తామే పరిష్కరించుకోవడానికి వీలుగా ఒక నూతన వేదికను ఏర్పాటు చేసుకోవాలని, బాహ్య దేశాల 'జోక్యం' లేని భద్రతా వ్యవస్థను చైనా ప్రోత్సహిస్తుందని తెలిపారు.

## ఇరాన్ ఆర్థిక మూలాలపై యుద్ధోన్మాద పడగ

**-చమురు నిల్వలపై అమెరికా, ఇజ్రాయిల్ దాడులు**
**- టెహ్రాన్‌ను కమ్మేసిన కారుమబ్బులు**



**టెహ్రాన్ 08 మార్చి డ్రీమ్ టైమ్స్:**
అమెరికా, ఇజ్రాయిల్ యుద్ధోన్మాద దాడులు తొమ్మిదో రోజు అయిన ఆదివారం కూడా కొనసాగాయి. ఇరాన్‌కు ఆర్థిక మూలాలను దెబ్బతీసే వ్యూహంతో తొలిసారి చమురు నిల్వల గోదాములను, సరఫరా కేంద్రాలను లక్ష్యంగా చేసుకొని అమెరికా, ఇజ్రాయిల్ సంయుక్త దాడులు చేపట్టాయి. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోనూ, పొరుగునున్న అల్‌బోర్జ్ ప్రావిన్సులోని చమురు నిల్వ గోదాములు, సరఫరా కంపెనీల క్షేత్రాలను ధ్వంసం చేశాయి. ఈ దాడులతో అక్కడ భయానక పరిస్థితులు నెలకొన్నాయి. ఆకాశాన్నింటేలా మంటలు ఎగిసిపడ్డాయి. నగరాన్ని మింగేసేలా దట్టమైన నల్లని మేఘాలు టెహ్రాన్ అంతటా అలుముకున్నాయి. ఈ దాడుల్లో నలుగురు ఉద్యోగులు ప్రాణాలు కోల్పోయారని ఇరాన్ చమురు సంస్థ వెల్లడించింది. ఈశాన్య టెహ్రాన్‌లోని అఘదసియాఎ? చమురు గోదాము, దక్షిణ ప్రాంతంలోని టెహ్రాన్ చమురుశుద్ధి క్షేత్రం, అలాగే పశ్చిమ ప్రాంతంలోని సదరన్ చమురు గోదాము, కారజ్ నగరంలోని మరో చమురు గోదాముపై ఈ దాడులు జరిగినట్లు వెల్లడించింది. ఈ దాడుల కారణంగా పెద్ద మొత్తంలో చమురు సమీప వీధుల్లోకి వదరలా ముంచెత్తిందని పేర్కొంది.

# యుద్ధంలో క్లస్టర్ బాంబులు

మొదటి తరువాయి

విస్తృత ప్రాంతంలో చిన్న చిన్న పేలుడు పదార్థాలను వెదజల్లే క్లస్టర్ బాంబులు అంతర్జాతీయంగా వివాదాస్పదం, చాలా ప్రమాదకరం. తాజాగా ఇజ్రాయిల్ ఆరోపణలతో ఈ ఆయుధాలపై మళ్లీ చర్చ నడుస్తున్నది. ఇజ్రాయిల్ సైన్యం తెలిపిన వివరాల ప్రకారం.. ఇరాన్ ఇటీవల జరిగిన దాడుల్లో 'క్లస్టర్ బాంబులు' అనే వివాదాస్పద ఆయుధాలను ఉపయోగించింది. ఈ బాంబులు గాల్లో పేలిపోయి చిన్న చిన్న పేలుడు పదార్థాలను విస్తృత ప్రాంతంలో వెదజల్లుతాయి. జనాభా ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వీటిని ఉపయోగించడం అంతర్జాతీయ మానవతా చట్టా లను ఉల్లంఘించే చర్యగా భావి స్తారు. యుద్ధం ప్రారంభమైన ప్పటి నుంచి ఇరాన్ పలుమార్లు క్లస్టర్ మ్యూనిషన్స్ ఉపయోగిం చిందని ఇజ్రాయిల్ సైన్య ప్రతి నిధి నాదావ్ షోషాని అన్నారు.

**ఇవి చాలా ప్రమాదకరం : నిపుణులు**

క్లస్టర్ బాంబులు చాలా ప్రమాదకర మైనవిగా నిపుణులు చెప్తున్నారు. ఇవి సాధారణ బాంబుల్లా ఒక్కసారి మాత్రమే పేలవు. బదులుగా.. గాలిలో పేలిపోయి అనేక చిన్న పేలుడు పదార్థాలు (బాంబ్లెట్స్) విస్తృత ప్రాంతంలో పడేలా చేస్తాయి. ఈ చిన్న బాంబ్లెట్స్ నేలపై పడిన వెంటనే పేలవచ్చు లేదా కొన్ని పేలకుండానే అలా నేలలో ఉండిపోవచ్చు. తర్వాత కూడా అవి ప్రమాదకరంగా మారి పౌరులకు హాని కలిగించే అవకాశం ఉంటుంది. అందుకే ఈ ఆయుధాలను ప్రపంచ వ్యాప్తంగా చాలా ప్రమాదకర మైనవిగా చూస్తున్నారు. ఇరాన్ ప్రయోగించిన ఒక క్షిపణి సుమారు ఏడు కిలోమీటర్ల ఎత్తులో పేలిపోయి, దాదాపు 20 చిన్న బాంబ్లెట్స్ సుమారు 8 కిలోమీటర్ల పరిధిలో పడిపోయినట్టు ఇజ్రాయిల్ రక్షణ దళాలు చెప్తున్నాయి. ఇలాంటి ఆయుధాలు యుద్ధంలో సైనిక లక్ష్యాలను మాత్రమే కాకుండా పౌరులను కూడా ప్రమాదంలో పడేస్తాయని విమర్శలు ఉన్నాయి. అందుకే 2008లో రూపొందించిన క్లస్టర్ మ్యూనిషన్స్ కన్వెన్షన్ అనే అంతర్జాతీయ ఒప్పందం.. వాటి వినియోగాన్ని నిషేధిం చింది. అయితే కొన్ని దేశాలు, ముఖ్యంగా ఇరాన్, ఇజ్రాయిల్ రెండూ ఆ ఒప్పందంపై సంతకాలు చేయలేదు.

# ఇస్లామిక్ నాటో' కూటమి దిశగా అడుగులు..?

మొదటి తరువాయి

ఈ నేపథ్యంలో సౌదీ అరేబియాపై డ్రోన్లు, క్షిపణి దాడులు జరిగాయి. ఈ పరిణామాలు పశ్చిమాసియాలో కొత్త భద్రతా సమీకరణాలకు దారితీస్తున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# రాష్ట్రపతిని అవమానించింది మీరే!

మొదటి తరువాయి

'భారత రాష్ట్రపతి, గిరిజన నాయకురాలిని గౌరవించని వ్యక్తి మీరు. మేం కాదు. రాష్ట్రపతి నిల్చొని ఉంటే, ప్రధాని మోదీ కూర్చున్నారు' అని మమత కీలక వ్యాఖ్యలు చేశారు. 2024 మార్చిలో ఎల్కే అద్వానీకి రాష్ట్రపతి భారతరత్న అందజేస్తున్న ఫొటోను ప్రస్తావిస్తూ, బీజేపీ ఆరోపణల్ని ఆమె తిప్పికొట్టారు.

# నేటి నుంచి రెండో విడత పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

మొదటి తరువాయి

జరగనున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో ఎంపీలందరూ సభా కార్యక్రమాలకు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశిస్తూ బిజెపి మూడు లైన్ల విప్ జారీ చేసింది. అలాగే ప్రతిపక్ష కాంగ్రెస్ సైతం ఈ నెల 11 వరకు సభకు హాజరు కావాలని ఎంపీలకు ఇప్పటికే విప్ జారీ చేసింది. ఇతర ప్రతిపక్ష పార్టీలు కూడా విప్ జారీ చేశాయి. స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం, పశ్చిమాసియా దేశాల్లో దాడులు, ఇతర అంశాలపై అధికార పక్షాన్ని నిలదీసేందుకు కాంగ్రెస్‌తో పాటు మిగిలిన ప్రతిపక్ష పార్టీలు సిద్ధమయ్యాయి. అయితే... వెస్ట్ బెంగాల్‌లో అంతర్జాతీయ సంతల్ కాన్క్లేవ్ విషయంలో రాష్ట్రపతి ముర్ముకు జరిగిన అవమానం, ఏఐ సమ్మిట్‌లో యూత్ కాంగ్రెస్ నేతల అర్ధనగ ప్రదర్శన, ఇతర అంశాలపై విపక్షాలు టార్గెట్‌గా ఎన్‌డిఎ వ్యూహాలు అమలు చేయనుంది.

**గతంలో మూడుసార్లు..**

పార్లమెంట్ చరిత్రలో మూడుసార్లు లోక్‌సభ స్పీకర్‌పై ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానాన్ని పెట్టినట్టు రికార్డులు చెబుతున్నాయి. 1954లో ఆనాటి తొలి స్పీకర్ బివి మావలంకర్‌పై ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానం పెట్టాయి. అనంతరం 1966లో హుకుం సింగ్, చివరగా 1987 ఏప్రిల్ 17లో అప్పటి స్పీకర్ బలరాం జాఖర్ పై తీర్మానాలు ప్రవేశపెట్టారు. కానీ ఈ మూడు సందర్భాల్లో స్పీకర్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గలేదు. దీంతో వారు స్పీకర్లుగా కొనసాగారు. అయితే, స్పీకర్ ఓం బిర్లా విషయంలోనూ ఇదే కొనసాగుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఎందుకంటే ప్రస్తుతం లోక్‌సభలో 543 స్థానాలకు గానూ ఎన్డీఏ కూటమికి 335, ఇండియా బ్లాక్ 230 ఎంపిల సంఖ్యాబలంతో ఉన్నాయి. దీంతో రాజ్యాంగంలోని ఆర్టికల్ 94 (సి) ప్రకారం స్పీకర్‌ను తొలగించేందుకు కావాల్సిన సంఖ్యాబలం ఇండియా బ్లాక్ వద్ద లేదనే చెప్పాలి. తాజాగా 2024లో ఆనాటి రాజ్యసభ చైర్మెన్ (ఉపరాష్ట్రపతి) జగదీప్ దన్‌ఖర్‌పై ప్రతిపక్షం అవిశ్వాస తీర్మానం పెట్టింది. 2024 డిసెంబర్ 10న దన్‌ఖర్ తొలగింపు నోటీసుపై కనీసం 60 మంది ప్రతిపక్ష సభ్యులు సంతకం చేశారు. అయితే, డిప్యూటీ చైర్మెన్ హరివంశ్ ఈ తీర్మానాన్ని తోసిపుచ్చారు.

# మండలి'కి కొత్త శోభ

మొదటి తరువాయి

మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, గడ్డం వివేక్, మహ్మద్ అజారుద్దీన్, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, రాజ్యసభ సభ్యులు వేంనరేందర్‌రెడ్డి తదితర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. శాసనమండలిలోని తన ఛాంబర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా పూజచేశారు. కార్యక్రమం పూర్తయిన తర్వాత మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి బ్రేక్‌ఫాస్ట్ చేశారు. అనంతరం అక్కడి నుంచి మహిళా జర్నలిస్టులతో ఉమెన్స్ డేలో పాల్గొనేందుకు ప్రజాభవన్‌కు వెళ్లిపోయారు. 1905లో నిర్మితమైన ఈ టౌన్ హాల్ భవనం రాజస్తాన్, పర్షియన్ శైలిలో సుందరంగా నిర్మించారు. చారిత్రక ప్రాముఖ్యత కలిగిన ఈ భవనం అప్పట్లోనే ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ, శాసనమండలి ఒకే ప్రాంగణంలో కొనసాగేవి. అయితే, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ రెండు వేర్వేరు భవనాల్లో కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో శాసన కార్యకలాపాలు ఒకే ప్రాంతంలో ఉండాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చారిత్రక వారసత్వాన్ని కాపాడే దిశగా చర్యలు చేపట్టారు.

# ఆస్పత్రుల్లో ఏఐ సేవలు



తెనాలిలోని జిల్లా ఆస్పత్రి, ఇతర చోట్ల పైలట్ ప్రాజెక్టు విధానంలో వివిధ రకాల పరీక్ష లు చేస్తున్నామని చెప్పారు. రోగులు, వైద్యుల మధ్య జరిగే సంభాషణను రికార్డింగ్ చేయడం, దగ్గు ద్వారా టీబీని గుర్తించడం, గుండెజబ్బులు, రక్తహీనతను గుర్తించడం, సర్వైకల్ క్యాన్సర్ చికిత్సలో ఏఐ కెమెరా వినియోగం, చిన్నపిల్లల్లో న్యూరాలజికల్ డిజార్డర్స్, క్యాటరాక్ట్, గ్లౌకోమా, రక్తహీనత, ఇతర పరీక్షలకు ఆధునిక సాంకేతిక పరికరాలను వినియోగిస్తారని తెలిపా రు. ఇటీవల ఆస్పత్రుల్లో పైలట్ విధానంలో ప్రారంభమైన వీటి ఫలితాలపై సీఎం చంద్రబాబుకు నివేదిక అందిస్తామని మంత్రి తెలిపారు.

# మూడోసారి కప్పు కైవసం

మొదటి తరువాయి




ఆరంభంలోనే న్యూజిలాండ్ నడ్డి విరిచారు. పవర్‌ప్లేలోనే భారత్ విజయాన్ని ఖరారు చేశారు. 19 ఓవర్లలో 159 పరుగులకు న్యూజిలాండ్ కుప్పకూలింది. అంతకముందు, తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ టాప్-3 బ్యాటర్లు విశ్వరూపం చూపించగా నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 255 పరుగుల భారీ స్కోరు చేసింది. సంజు శాంసన్ (89, 46 బంతుల్లో 5 ఫోర్లు, 8 సిక్స్‌లు), ఇషాన్ కిషన్ (54, 25 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లు), అభిషేక్ శర్మ (52, 21 బంతుల్లో 6 ఫోరుల, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీలతో చెలరేగారు. శివం దూబె (26 నాటౌట్, 8 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఆఖర్లో అదరగొట్టాడు. కివీస్ పేసర్ జేమ్స్ నీషమ్ (3/46) రాణించాడు.

టాప్‌గేర్‌లో టాప్-3 :

టాస్ ఓడిన భారత్ తొలుత బ్యాటింగ్‌కు వచ్చింది. ఆచితూచి ఆడిన సంజు శాంసన్ (89) సిక్సర్‌తో పరుగుల వేట షురూ చేశాడు. వరుస వైఫల్యాలతో ఒత్తిడిలో పడిన అభిషేక్ శర్మ (52) సైతం నెమ్మదిగానే ఇన్నింగ్స్‌ను ఆరంభించాడు. దీంతో తొలి రెండు ఓవర్లలో 12 పరుగులే వచ్చాయి. మూడో ఓవర్లో మొదలైన తుపాన్.. పవర్‌ప్లేలోనే కివీస్ బౌలర్లను ముంచెత్తింది. అభిషేక్ శర్మ, సంజు శాంసన్ శివమెత్తగా.. వరుస ఓవర్లలో 24, 21, 20 పరుగులు పిండుకున్నారు. దీంతో పవర్‌ప్లేలోనే భారత్ 92/0తో నిలిచింది. ఆఫ్ స్పిన్ బలహీనత అధిగమిస్తూ పేసర్లపై పంజా విసిరిన అభిషేక్ శర్మ 6 ఫోర్లు, 3 సిక్సర్లతో 18 బంతుల్లోనే అర్ధ సెంచరీ సాధించాడు. సంజు శాంసన్, అభిషేక్ శర్మ తొలి వికెట్‌కు 43 బంతుల్లోనే 98 పరుగులు జోడించారు. భారత్ భారీ స్కోరుకు బలమైన పునాది వేశారు. అభిషేక్ శర్మ నిష్క్రమించినా.. భారత్ దూకుడు తగ్గలేదు. సంజు శాంసన్‌కు తోడైన ఇషాన్ కిషన్ (54) రెండో వికెట్‌కు 48 బంతుల్లోనే 105 పరుగుల భాగస్వామ్యం నిర్మించాడు. 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 23 బంతుల్లోనే ఇషాన్ కిషన్ అర్ధ సెంచరీ సాధించగా.. సంజు శాంసన్ 4 ఫోర్లు, 3 సిక్సర్లతో 33 బంతుల్లో ఫిఫ్టీ అందుకున్నాడు. టాప్-3 బ్యాటర్ల ధనాధన్‌తో భారత్ 15 ఓవర్లలోనే 200 పరుగుల మైలురాయి దాటింది. ఇన్నింగ్స్ 16వ ఓవర్లో జేమ్స్ నీషమ్ గొప్పగా బౌలింగ్ చేశాడు. సంజు శాంసన్, ఇషాన్ కిషన్ సహా సూర్యకుమార్ యాదవ్ (0)ను అవుట్ చేశాడు.

**ఆఖర్లో శివం షో :**

జేమ్స్ నీషమ్ ఓ ఓవర్లో మూడు వికెట్లు పడగొట్టగా.. భారత్ స్కోరు నెమ్మదించింది. 16-19 ఓవర్లలో భారత్ 28 పరుగులే (24 బంతుల్లో) చేసింది. 300 స్కోరుపై అభిమానులు ఆశలు పెట్టుకోగా.. 250 కొట్టినా సంతోషమే అనిపించింది. ఆఖరు ఓవర్లో శివం దూబె (26 నాటౌట్) శివమెత్తాడు. ఫోర్లు, సిక్సర్లతో దంచికొట్టాడు. చివరి 6 బంతుల్లో 24 పరుగులు పిండుకున్నాడు. దీంతో భారత్ 255 పరుగులు చేసింది. హార్దిక్ పాండ్య (18, 13 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్), తిలక్ వర్మ (8 నాటౌట్, 6 బంతుల్లో) ఫర్వాలేదనిపించారు.

# మహిళల అభ్యున్నతికి కూటమి కృషి

మొదటి తరువాయి



వారికి అభివాదం చేశారు. అనంతరం చిన్నారులు షర్మిల, మహిమలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా 'ఒక కుటుంబం- ఒక వ్యాపారవేత్త' కార్యక్రమానికి సంబంధించి రూపొందించిన పలు ఏవీలను సభలో ప్రదర్శించారు. స్వయం సహాయక సంఘాల మహిళలు సాధించిన స్ఫూర్తిదాయక విజయగాథలను వివరించారు. సీఎం సహా సభలో పాల్గొన్న పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఏవీలను వీక్షించారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడారు. "స్త్రీలను గౌరవించి, పూజించిన చోట సంపదకు లోటుండదు. దేశంలోనే మొదటిసారిగా మహిళలకు న్యాయం చేసింది ఎన్టీఆరే. మహిళలకు ఆస్తిలో సమాన హక్కులు కల్పించి దేశానికే మార్గనిర్దేశం చేశారు. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు తెచ్చారు. ఇప్పుడు నేను, మిత్రుడు పవన్ కల్యాణ్, ప్రధాని మోదీ మహిళల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నాం. ఇప్పటికే స్థానిక సంస్థల్లో మహిళల ప్రాధాన్యం 50 శాతానికి పెరిగింది. మోదీ నేతృత్వంలో త్వరలో చట్టసభల్లో కూడా 33 శాతం రిజర్వేషన్ అమల్లోకి రాబోతోంది" అని తెలిపారు. ఇంకా ఏం చెప్పారంటే.2019-24 మధ్య రాష్ట్రంలో విధ్వంసం జరిగి నష్టపోయాం. పేదలకు న్యాయం చేయాలని, డ్వాక్రా, మెప్మా సంఘాలకు పూర్వ వైభవం తేవాలని నేను, మోదీ, పవన్ కలిశాం. లక్ష మంది మహిళలను పారిశ్రామికవేత్తలను చేస్తామని చెప్పాం. 1,12,686 మంది మహిళలు ఎంఎ?సఎంఈలు ఏర్పాటు చేశారు. ఈ రోజు నుంచి వచ్చే ఏడాదికి 5 లక్షల మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తయారు చేస్తాం. రాష్ట్రంలో 84.66 లక్షల మంది డ్వాక్రా సభ్యులుగా, 8.34 లక్షల సంఘాలు ఉన్నాయి. ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేయాలని సంకల్పించాం. రూ.21 వేల కోట్లు కార్పస్ ఫండ్ కింద మీ వద్ద ఉంది. మెప్మా సంఘాల వారినీ అభివృద్ధి చేస్తున్నాం. దేశంలో 6 లక్షల మంది ఆడబిడ్డలు పారిశ్రామికవేత్తలుగా ఉండే ఏకైక రాష్ట్రం మనదే అవుతుంది. మహిళల ఉత్పత్తుల కోసం 'స్వయం' అనే కొత్త బ్రాండ్ ఇప్పుడే ప్రారంభించాం. అందులో మీ ఫొటోనే ఉంటుంది. 1.10 కోట్ల మంది సభ్యులుగా ఉన్నారు. డ్వాక్రా సభ్యులు తయారు చేసే ఉత్పత్తులను 3.30 కోట్ల మంది వినియోగించుకుంటారు. స్వయం బ్రాండ్‌ను గ్లోబల్ బ్రాండ్‌గా మార్చే బాధ్యత మేం తీసుకుంటాం. నాణ్యత ఉండాలి. ప్యాకేజింగ్, రెసిపీ విధానం మెరుగు పరచుకోవాలి. మెషనరీ ఇప్పించే బాధ్యత నాది. ఊళ్లల్లోనే కూర్చుని ఉత్పత్తులు తయారు చేసే బాధ్యత మహిళలది. మహిళలు స్వయం బ్రాండ్లను అమ్మాలి. స్వయం ఉత్పత్తులనే వినియోగించాలి. డ్వాక్రా మహిళల స్వయం బ్రాండ్‌ను ప్రమోట్ చేయడానికి నేను బ్రాండ్ అంబాసిడర్‌గా ఉంటా. డ్వాక్రా ఉత్పత్తులకు సంబంధించి ఇదే వేదికపై 37 ఎంఓయూలు చేసుకున్నాం. మార్కెట్లు, క్వాలిటీ పెంచడానికి, టెక్నాలజీ వినియోగానికి అవి ఉపయోగపడతాయి.

# ఏఐను సమర్థవంతంగా వినియోగించాలి

మొదటి తరువాయి




ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తాను తొలిసారి శాసనసభ్యుడిగా ఎన్నికైన సమయంలో రాష్ట్రంలో తీవ్రవాదం విస్తృతంగా ఉండేదన్నారు. పోలీసు అధికారుల అలుపెరగని కృషి, త్యాగాలతో నేడు తీవ్రవాదం అంతమైందన్నారు. సెలవులు కూడా లేకుండా విధులు నిర్వర్తిస్తూ, ఎందరో అధి కారులు, సిబ్బంది ప్రాణత్యాగం చేశారని చెప్పారు. వారి సేవలకు ఎప్పటికీ గౌరవం ఉంటుందని కొనియాడారు. భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనేలా పోలీసింగ్ వ్యవస్థను సిద్ధం చేయడమే ఈ రిట్రీట్ ప్రధాన ఉద్దేశమని ఆయన వివరించారు. పోలీసు అధికారులు తమ విధి నిర్వహణలో ప్రజలకు వాస్తవంగా న్యాయం చేస్తున్నామా? లేదా? అని స్వీయ విమర్శ చేసుకోవాలని మంత్రి సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలకు నమ్మకం కలిగించినప్పుడే వ్యవస్థకు గుర్తింపు వస్తుందన్నారు. ఈ రెండు రోజుల రిట్రీట్ ద్వారా సమీక్షించుకుని, తెలంగాణ పోలీస్ శాఖకు మరింత ఖ్యాతి తీసుకురావాలని ఆయయన ఆకాంక్షించారు.

తెలంగాణ డీజీపీ బత్తుల శివధర్‌రెడ్డి మాట్లాడుతూ... రిట్రీట్‌లో జరిగే చర్చలు వాస్తవికతకు దగ్గరగా ఉండాలని సూచించారు. ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా పోలీసుశాఖ లో చేపట్టాల్సిన సంస్కరణలపై మేధోమథనం జరగాలన్నారు. ఓపెన్ ఫోరంలో అధికారులు తమ అభిప్రాయాలను నిర్భయంగా వెల్లడించి, వాటిని క్షేత్రస్థాయిలో అమలు చేయాలని కోరారు. అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ మాట్లాడుతూ.. రెండు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో అధికారులను ఆరు గ్రూపులుగా విభజించినట్టు తెలిపారు. వివిధ అంశాలపై లోతైన చర్చలు జరిపి నివేదికలు రూపొందిస్తామని వివరించారు. మాజీ డీజీపీ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. జనాభా పెరుగుతున్న నిష్పత్తికి తగ్గట్టు సిబ్బంది నియామకం ఎప్పుడూ సాధ్యపడదని, అందుకే అందుబాటులో ఉన్న వనరులతోనే పనితీరును ఎలా మెరుగుపరుచుకోవాలో యోచించాలన్నారు. ప్రస్తుతం దేశంలోనే తెలంగాణ పోలీస్ అగ్రస్థానంలో ఉందని, ఆ స్థానాన్ని సుస్థిరం చేసుకోవాలని పిలుపునిచ్చారు. మరో మాజీ డీజీపీ హెచ్.జె. దొర మాట్లాడుతూ.. అధికారులు తమ అనుభవాలను రంగరించి శాంతిభద్రతల పరిరక్షణలో మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖా గోయల్, శాంతి భద్రతల అదనపు డీజీపీ మహేశ్ ఎం భగవత్, గ్రేహౌండ్స్ అడిషనల్ డీజీపీ అనిల్ కుమార్, 'ఈగల్' డైరెక్టర్ సందీప్ శాండిల్య, సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేశ్ సహా పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

కాగా ఈ పోలీస్ రిట్రీట్‌ను ఉమ్మడి ఏపీలో అప్పటి డీజీపీ హెచ్.జె దొర.. పోలీసు శాఖకు నాయకత్వం వహించే ఐపీఎస్ అధికారులకు రిట్రీట్(పున:శ్చరణ) కార్యక్రమాన్ని మొదటిసారిగా ప్రారంభించారు. ఏడాది కాలంలో ఐపీఎస్ అధికారులు సాధించిన విజయాలు, ఎదుర్కొన్న సమస్యలు, నూతన సవాళ్లు, వాటిని అధిగమించడానికి తీసుకోవాల్సిన చర్యలు, ప్రజల విశ్వాసాన్ని మరింతగా చూరగొనడానికి పోలీసులు అందించాల్సిన సేవలు తదితర అంశాలపై ఈ రిట్రీట్‌ను నిర్వహించేవారు. అందుకోసం రిట్రీట్‌లోనే అధికారులతో అంతర్గత కమిటీలను వేసి, ఆయా అంశాలపై ఆ కమిటీలు చర్చించి చేసిన సిఫారసులను అమలు చేసే విషయమై దృష్టిని సారించేవారు. తాజాగా అదే స్ఫూర్తితో కాంగ్రెస్ ప్రభుత్వం ఐపీఎస్‌ల రిట్రీట్ కార్యక్రమాన్ని తిరిగి చేపట్టింది. సోమవారం రిట్రీట్ ముగింపు సభకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేయనున్నారు.

# సంపాదకీయం

## వికారం



ఒక పసిగుడ్డు కాళ్లూ చేతులూ తెగ్గోసి వేళ్లాడదీసిన దృశ్యంకంటే ఘోరంగా, నడవలేని వృద్ధుడి పొట్టలో కత్తిదింపి పేగుల్ని బహిర్గతపరచిన దృశ్యంకన్నా దారుణంగా, పురిటినొప్పులు పడుతున్న ఒక స్త్రీపై లైంగికదాడి జరిపే కామాంధుడికన్నా వికారంగా నాకీ దేశపు వర్తమానం ఇంకా ఘోరంగా, దారుణంగా, వికారంగా కనిపిస్తుంది" అంటాడు అలిశెట్టి ప్రభాకర్. ఎప్పుడో రాసిన ఆయన మాటల్ని ఈరోజు యుద్ధ సందర్భాన మనదేశం తీసుకున్న వైఖరిని, మౌనాన్ని చూస్తుంటే సరిపోతాయని అనిపిస్తోంది. మనం ప్రత్యక్షంగా దారుణాలు, హత్యలు చేయక్కర్లేదు. ఆ దుర్మార్గాలను చూస్తూ స్పందించక, ఉదాసీనంగా, అసలు మనకేమీ సంబంధం లేనట్టు ఉండిపోవడం, అసలు నేరంకన్నా తీవ్రమైనది. దారుణమైనది. అమెరికా, ఇజ్రాయిల్ కలిసి, ఇరాన్‌పై చేస్తున్న యుద్ధ బీభత్సాన్ని, జరుగుతున్న మానవ హననాన్ని చూస్తూ మౌనంగా ఉండటం, భారతీయతత్వానికి, హృదయానికి పూర్తి వ్యతిరేకమైనది. మనదేశపు వారసత్వ సంప్రదాయానికి, ఇక్కడి ప్రజాస్పందనలకు వ్యతిరేకమైనది. ఇలా వ్యవహరించడం చాలా వికారంగానూ ఘోరంగాను కనిపిస్తున్నది. 164మంది ప్రాథమిక పాఠశాలలో పాఠాలు చదువుతున్న చిన్నారులు ఈ ప్రపంచానికీ కొత్తగా పరిచయమవుతున్న వాళ్లు, 'పాపం, పుణ్యం, ప్రపంచమార్గం, కష్టం సౌఖ్యం శేషార్థాలు, ఏమీ ఎరుగని' పులుగులు. మెరుపు మెరిస్తే వానకురిస్తే, ఆకసమున హరివిల్లు విరిస్తే, అది నాకే అనుకుని' మురిసిపోయే పసికందులు.. వాళ్లు తరగతి గదిలోనే ఉండగా, మంటల బాంబులు, క్షిపణులు విరుచుకుపడగా, మాంసం ముద్దలుగా ఎగిరిగోడలపైకి చిందిపడ్డ దృశ్యాలను ఎలా చూడగలము! మానవ హృదయమన్నది ఉంటే, ఎలా తట్టుకోగలదు! ఆ తల్లుల కడుపుకోతను ఈ ప్రపంచం ఓదార్చగలదా! సామాన్యులపైన, పిల్లలపైన బాంబులువేసి చంపుతున్న వాళ్లు, మేము శాంతి కోసం, న్యాయం కోసం యుద్ధం చేస్తున్నామని చెబుతున్న మాటలకు ఏమైనా అర్థం ఉన్నదా! ఇజ్రాయిల్, అమెరికా మాటలను ఇప్పటికీ తలలాడిస్తూ వింటున్న దేశాలకు, మనుషులకు, నాయకులకు కించిత్ మానవ లక్షణముంటే ఎంతబావుండు! ఇట్లాంటి ఘటన జరిగి వరుసగా పిల్లల శవాలను సమాధి చేస్తున్న చిత్రాన్ని కూడా చూసి, తానేమీ చూడనట్టు, తనకేమీ కానట్టు మౌనంగా ఉండిపోయిన 140 కోట్ల ప్రజల దేశపు ప్రతినిధిని చూస్తే నిజంగా అలిశెట్టి చెప్పినట్టు వర్తమానమంతా దారుణంగా, వికారంగా కనిపించటం లేదా! ఇంతటి నరహంతకులతో ఆలింగనాలు చేసి, ఎంతో ప్రేమను ఒలకబోసి, మేము మీకు అండగా ఉంటాము. శాంతికి సహకరిస్తామని వాగ్దానం చేసిన మన దేశ నాయకున్ని చూస్తే అసహ్యమేయటం లేదూ! పాముకు పాలు, చీమకు పంచదారవేసి, నేలపైని సమస్త జీవుల యెడల కారుణ్యతను చూపిన నేల ఇది. సత్యము, అహింస, పరమధర్మాలుగా బోధించిన భూమి ఇది. ప్రపంచానికి ఆదర్శ మార్గాలను సూచించిన బుద్ధుడు, వర్ధమాన మహావీరుడు జన్మించిన స్థలమిది. సేవను, సహోదరత్వాన్ని బోధించిన పరమహంసలు నడయాడిన ప్రాంతమిది. సమస్త ఆలోచనలను, ఆచరణలను, సంస్కృతులను స్వీకరించిన ఈ దేశ ఔన్నత్యాన్ని ఎంత నిర్దాక్షిణ్యంగా పాతరేస్తున్నారు నేటి నాయకులు! తమ జాతిపక్షులు చనిపోతే, అయ్యో అని పక్షులన్నీ మూగుతాయి కదా! అంతమంది పిల్లలు చనిపోతే ఒక్కమాట సంతాపం ప్రకటించడానికి నోరురాకపోవడం చూస్తే, అగ్రరాజ్య అమెరికాకు ఎంత భయపడిపోతున్నాడో ఇట్టే అర్థమైపోతుంది. మన విశాఖ పట్టణానికి నౌకా విన్యాసాలలో పాల్గొనేందుకు వచ్చిన ఇరాన్ నౌకను, తిరిగివారి దేశం వెళుతుండగా శ్రీలంక సమీపంలో హిందూ మహాసముద్రంలో అమెరికా ముంచేసి పేల్చివేస్తే కూడా కిమ్మనకుండా నోరు మూసుకుని మన దేశం ఉందంటే, స్వతంత్రతను, అన్యాయాన్ని అన్యాయమని చెప్పే ధైర్యాన్ని ఎంత కోల్పోయామో తెలుస్తున్నది కదూ!చమురు నిల్వలు పడిపోతున్న తరుణంలో భారతదేశంపై ఎంతో కరుణతో ఒక నెల రోజులవరకు రష్యా నుండి చమురు కొనుగోలు చేసుకోవచ్చని, ఒక స్వేచ్ఛను ప్రసాదించింది అమెరికా. మనవాడు చేతులు కట్టుకునిమరీ తలూపడం ఎంత వికారమో కదా! ఇంత వెన్నెముకలేనితనమా! ఇరాన్ పర్షియా దేశం కొన్ని శతాబ్దాలుగా మనతో సంబంధాలున్న దేశమది. మిత్రదేశం కూడా సంస్కృతి పరంగా, ఆర్థికంగా కూడా ఎన్నో యేండ్ల బంధమది. అట్లాంటి దేశపు నేతను దాడిచేసి చంపితే మాట కూడా పెగలకపోవడం, విచారం ప్రకటిం చకపోవడం ఏరకమైన దౌత్యనీతి. పసిపిల్లల మరణానికీ చలించని పాషాణం నేత హృదయం!

# మహిళా సాధికారత కోసం సమాన హక్కుల పిలుపు



**హుస్నాబాద్, మార్చి 8 డ్రీమ్ టైమ్స్:** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా హుస్నాబాద్ పట్టణంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో మై భారత్, సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్‌పర్సన్ దండు లక్ష్మి కొమురయ్య మాట్లాడుతూ మహిళలు వంటింటికే పరిమితం కాకుండా సమాజహిత కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని, సమాన హక్కుల సాధన కోసం అందరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆమె ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కస్తూర్బా గాంధీ విద్యాలయం ప్రత్యేక అధికారి రాగుల మమతా యాదవ్‌ను ఘనంగా సన్మానించారు. అలాగే ఉపాధ్యాయురాళ్లకు శాలువాలు కప్పి సత్కారం చేశారు. జిల్లా యువజన క్రీడా అధికారి జంగాపల్లి వెంకట నరసయ్య మాట్లాడుతూ మహిళలు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని, ఆటలు ఆరోగ్యానికి మూలమని గుర్తించారు. సంకల్ప సంస్థ అధ్యక్షుడు వలస సుభాష్ మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామని, సావిత్రిబాయి ఫూలే వంటి ఆదర్శవంతమైన మహిళామూర్తులను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చిత్తరి పద్మా రవీందర్, కౌన్సిలర్ సావుల మంజుల, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ దండు లక్ష్మి పాడిన పాట సభలో ఆకర్షణీయంగా నిలిచింది. వివిధ రంగాల్లో రాణిస్తున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

# మహిళా దినోత్సవం సందర్భంగా హెచ్పీవీ టీకా కార్యక్రమం ప్రారంభం

**సిద్దిపేట, మార్చి 8 డ్రీమ్ టైమ్స్:** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సిద్దిపేట పురపాలక సంఘం ఆధ్వర్యంలో ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కోమటి చెరువు వద్ద జరిగిన ఈ వేడుకకు జిల్లా కలెక్టర్ హైమావతి, మున్సిపల్ చైర్‌పర్సన్ కడవేరుగు మంజుల రాజనర్సు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ ప్రతి ఇంటి బాధ్యత మహిళ హక్కు అని, దానిని సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. పుట్టింటిలో మహిళకు మొదటి దైవం తల్లి అని పేర్కొన్నారు. వృద్ధాశ్రమాల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో అత్తమామలను తల్లిదండ్రుల వలే చూసుకోవడం ప్రతి మహిళ బాధ్యత అని అన్నారు. మహిళలు ప్రతిరోజూ మహిళా దినోత్సవంలా ఆనందంగా, సుభిక్షంగా గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అంబిటస్ పాఠశాల విద్యార్థులకు బహుమతులు అందజేశారు.




మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్, మహిళా కౌన్సిలర్లు బింగి బాల్ లక్ష్మి, బందారం శ్రీలత, అంబిటస్ పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస్ రెడ్డి, మెప్మా అధికారి సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా సిద్దిపేట గవర్నమెంట్ జనరల్ ఆసుపత్రిలో హెచ్పీవీ టీకా కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ హైమావతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని 6 కేంద్రాల్లో వ్యాక్సినేషన్ కార్యక్రమం జరుగుతుందని, 14 సంవత్సరాల వయస్సు గల 10,147 మంది బాలికలందరూ హెచ్పీవీ టీకా తీసుకునేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఒకే డోస్‌తో గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ నివారించవచ్చని, ప్రజలు ఎలాంటి అపోహలకు గురికాకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. ధనరాజ్, డిప్యూటీ డీఎంఅండ్ హెచ్ఓ డా. శ్రీనివాస్, ఎన్సిడి ప్రోగ్రాం ఆఫీసర్ వినోద్ బాబ్జి, సిహెచ్ఐ ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. దీప్తి ప్రియాంక, డా. శ్రీకాంత్, ఆర్ఎంఓ డా. జ్యోతి, డా. సదానందం, డా. శ్రావణి, డా. సురేష్ బాబు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ చైర్మన్ గా శ్రీనివాస్ గౌడ్ ను నియమించాలి

- గౌడ సంఘం యువజన నాయకుడు వెంకటేష్ గౌడ్



**ఆమనగల్లు, మార్చి 8 డ్రీమ్ టైమ్స్:** రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ చైర్మన్ గా టీపీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్ ను నియమించాలని ఆమనగల్లు గౌడ యువజన సంఘం నాయకులు మారేపల్లి వెంకటేష్ గౌడ్ కోరారు. ఆదివారం ప్రకటనలో వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ పట్ల విధేయతగా ఉంటూ సేవ చేస్తున్న కల్వకుర్తి నియోజకవర్గ సీనియర్ నాయకులు, పీసీసీ కార్యవర్గ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్ కు రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ చైర్మన్ గా నియమించాలని తెలిపారు. పార్టీలో అవకాశాలు వచ్చిన రాకున్నా కష్టకాలంలో పార్టీకి అండగా ఉంటూ అహర్నిశలు కృషి చేస్తున్న శ్రీనివాస్ గౌడ్ సేవలను గుర్తించి కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి లను ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేశారు.

# పరిశుభ్రతపై అవగాహన సదస్సు



**అమ్రాబాద్, మార్చి 8 డ్రీమ్ టైమ్స్:** ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా అమ్రాబాద్ మండల కేంద్రంలో పరిశుభ్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చిగుర్ల కోటయ్య మాట్లాడుతూ గ్రామంలో తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి పంచాయతీ ట్రాక్టర్లలో వేయాలని ప్రజలను కోరారు. అలాగే ప్రతి ఇంట్లో మురుగు నీరు వీధుల్లోకి రాకుండా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పరిశుభ్రత పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో అమరేశ్వర దేవాలయం చైర్మన్ తిప్పర్తి శ్రీనివాసులు, నోముల జగన్, ఇమ్మడి వెంకటేశ్వర్లు, రవి, గ్రామపంచాయతీ సిబ్బంది ఇసాక్, వెంకటయ్య పాల్గొన్నారు.

# మహిళల సాధికారతతోనే సమాజ అభివృద్ధి






**- మంత్రి ఎన్ఎండి ఫరూక్**
**-ప్రతి రంగంలో మహిళలకు సమాన అవకాశాలే ప్రభుత్వ లక్ష్యం**
**- మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి**

**నంద్యాల, మార్చి 08 (డ్రీమ్ టైమ్స్)**
మహిళలు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో ముందుకు రావడమే సమాజ పురోగతికి పునాది అని జిల్లా మంత్రులు ఎన్ఎండి ఫరూక్, బీసీ జనార్దన్ రెడ్డిలు పేర్కొన్నారు. ఆదివారం నంద్యాల పట్టణంలోని మునిసిపల్ టౌన్ హాలులో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకల్లో మంత్రులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ చదువు మనిషి జీవితాన్ని మార్చగల శక్తి అని పేర్కొన్నారు. విద్య లేనివాడు ప్రపంచంలో అవకాశాలను సద్వినియోగం చేసుకోలేడని, ప్రతి కుటుంబం పిల్లల విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా మహిళల విద్యాభివృద్ధి ఇంకా పెరగాల్సిన అవసరం ఉందని, గ్రామీణ ప్రాంతాల్లో మహిళల చదువును ప్రోత్సహించాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. ఇంజనీరింగ్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినప్పటికీ ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తున్న యువతిలో చాలా మంది మహిళలే ఉన్నారని ఆయన తెలిపారు. వివాహం అయిన తర్వాత కూడా పిల్లలను చూసుకుంటూ చదువు కొనసాగిస్తూ పరీక్షలకు హాజరవుతున్న మహిళల పట్టుదల అభినందనీయం అన్నారు. గత కొన్నేళ్లుగా నిలిచిపోయిన డీఎస్సీ పరీక్షలను మళ్లీ నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. ఉపాధ్యాయ నియామకాల ప్రక్రియ ప్రారంభం కావడం వల్ల యువతకు మంచి అవకాశాలు కలుగుతాయని చెప్పారు. ఇటీవల నిర్వహించిన పరీక్షలకు హాజరైన అభ్యర్థుల్లో మహిళలు అధిక శాతం ఉండటం మహిళల చైతన్యాన్ని సూచిస్తుందని పేర్కొన్నారు.ప్రస్తుతం దేశంలో జనన రేటు తగ్గిపోతున్న నేపథ్యంలో మానవ వనరుల అభివృద్ధి ఎంతో కీలకమని మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. యువత సంఖ్య పెరిగితేనే దేశ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని, సమతుల్య జనాభా దేశ అభివృద్ధికి అవసరమని పేర్కొన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం బ్యాంకింగ్ వ్యవస్థ ద్వారా వేల కోట్ల రూపాయల సహాయాన్ని అందిస్తోందని ఆయన తెలిపారు. మహిళలు స్వయం ఉపాధి ద్వారా కుటుంబాలను నిలబెట్టడమే కాకుండా సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. ఒక ముస్లిం మహిళ తన కృషితో సంవత్సరానికి దాదాపు రూ.36 లక్షల ఆదాయం సంపాదిస్తూ వందలాది మందికి ఉపాధి కల్పిస్తున్న ఉదాహరణను మంత్రి ప్రస్తావించారు. ఇలాంటి మహిళలు సమాజానికి ప్రేరణగా నిలుస్తారని, వారిని ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఆడపిల్లల వివాహాల కోసం 'షాదీ ముబారక్' వంటి పథకాల ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన పేద కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందని మంత్రి వివరించారు. మహిళల సంక్షేమం, భద్రత కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. ప్రస్తుతం నిర్మాణ రంగం సహా అనేక ఉపాధి రంగాల్లో ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన కార్మికులు ఎక్కువగా పనిచేస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. ఒక ఇంటి నిర్మాణంలోనే అనేక రకాల పనులు ఉంటాయని, వాటిని నేర్చుకుంటే స్థానిక యువతకు మంచి ఆదాయం లభిస్తుందని సూచించారు. యువత నైపుణ్యాలను పెంపొందించుకుని అందుబాటులో ఉన్న అవకాశాలను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

**మహిళల పురోగతే నిజమైన అభివృద్ధి - రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి**
అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రంలోని మహిళలందరికీ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమని అన్నారు. మహిళలకు ఆస్తిలో సమాన హక్కులు కల్పించిన చారిత్రక నిర్ణయం తీసుకున్న నాయకుడు ఎన్టీఆర్ అని ఆయన గుర్తు చేశారు. మహిళా సాధికారత కోసం ముఖ్యమంత్రి నాయకత్వంలో ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. ఉచిత బస్సు సౌకర్యం, తల్లికి వందనం కార్యక్రమం, ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ వంటి పథకాల ద్వారా మహిళలకు ఉపశమనం కల్పిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే మహిళలు వ్యవసాయం, వ్యాపారం, స్వయం ఉపాధి వంటి అనేక రంగాల్లో పురుషులతో సమానంగా ముందుకు సాగుతున్నారని మంత్రి పేర్కొన్నారు. ఒకప్పుడు ఇంటికే పరిమితమైన మహిళలు ఇప్పుడు ఎంటర్ప్రెన్యూర్లుగా ఎదుగుతూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. మహిళలు తమలోని ప్రతిభను వెలికి తీసుకుని మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని మంత్రి ఆకాంక్షించారు. అంతకుముందు మంత్రులు స్వయం సహాయక సంఘాల మహిళలు తమ ఉత్పత్తులను ప్రదర్శించిన స్టాళ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్త్రీ శిశు సంక్షేమ అభివృద్ధి అధికారి లీలావతి, మున్సిపల్ కమిషనర్ శేషన్న, డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీధర్ రెడ్డి, మెప్మా పీడీ వెంకట దాసు తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# నైతిక విలువలు పెంపొందించుకోవాలి



**చిట్వేల్, మార్చి 8 డ్రీమ్ టైమ్స్:**
విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే నైతిక విలువలు, నిజాయితీ, ధర్మాన్ని ఎల్లప్పుడూ పాటించాలని ఉపాధ్యాయులు పసుపుల రాజశేఖర్ సూచించారు. తిరుపతి జిల్లా చిట్వేల్ శివాలయంలో ఆదివారం ధర్మనిధి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.
ఈ సందర్భంగా రాజు హరిశ్చంద్రుడి కథను విద్యార్థులకు వివరిస్తూ సత్యం, ధర్మం పాటించడం ఎంత ముఖ్యమో వివరించారు. ఎన్ని కష్టాలు ఎదురైనా హరిశ్చంద్రుడు తన మాట తప్పకుండా ధర్మాన్ని కాపాడినట్లు తెలిపారు. తన రాజ్యం, సంపద, కుటుంబం కోల్పోయినా సత్యాన్ని విడిచిపెట్టకుండా నిలబడ్డాడని చెప్పారు. చివరకు ఆయన నిజాయితీ, ధర్మబద్ధత ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందన్నారు.విద్యార్థులు కూడా హరిశ్చంద్రుడిని ఆదర్శంగా తీసుకొని నిజాయితీగా, ధర్మబద్ధంగా జీవించాలని సూచించారు. నైతిక విలువలు, క్రమశిక్షణ, పరస్పర గౌరవం వంటి లక్షణాలు ప్రతి విద్యార్థి భవిష్యత్తును ఆధ్యాత్మికంగా తీర్చిదిద్దుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మనిధి చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు సాయిరాం, వెంకట శివ, సునీల్ తదితరులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మంత్రిని మర్యాద పూర్వకంగా కలిసిన కేడీసీసీ బ్యాంక్ సీఈఓ శివలీల



**నంద్యాల ప్రతినిధి, మార్చి 08 (డ్రీమ్ టైమ్స్):**
ఉమ్మడి కర్నూలు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (కేడీసీసీ) సీఈఓ శివలీల ఆదివారం రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఫరూక్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. నంద్యాలలోని
మంత్రి క్యాంప్ కార్యాలయంలో మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి శు భాకాంక్షలు తెలిపారు. అనంతరం ఉమ్మడి జిల్లాలో కేడీసీసీ బ్యాంకు ద్వారా రైతులు, ఖాతాదారులకు అందుతున్న సేవలను, బ్యాంక్ ప్రగతిని మంత్రి ఫరూక్ కు వివరించారు. సహకార రంగం బలోపేతానికి, రైతులకు మరింత మెరుగైన సేవలు అందించేలా బ్యాంక్ కార్యకలాపాలు సాగాలని ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ సూచించారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు.

# న్యూఢిల్లీలో ఉగాది పురస్కార అవార్డు అందుకున్న సుదర్శన శర్మ



**రైల్వే కోడూరు, మార్చి 08, డ్రీమ్ టైమ్స్ న్యూస్**
తిరుపతి జిల్లా రైల్వే కోడూరు పట్టణ పరిధిలోని సీనియర్ పాత్రికేయులు శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణ కర్త ధర్మకర్త సమాజ సేవకులు డాక్టర్ బి సుదర్శన్ శర్మ ఇటీవల ఆది లీల ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఆదినారాయణ ప్రకటించిన జాతీయ స్థాయి ఉగాది పురస్కార అవార్డును ఆదివారం న్యూఢిల్లీలో అందుకున్నట్లు డాక్టర్ బండాత్మకూరు సుదర్శన్ శర్మ ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాకు ఈ అవార్డు ప్రకటించిన ఆదిలీల ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు వారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నానని, నా జీవిత ప్రస్థానంలో నేను చేసినటువంటి ఆధ్యాత్మిక, సామాజిక, సమాజ సేవలను గుర్తించి జాతీయస్థాయి ఉగాది పురస్కారానికి ఎంపికయ్యేదానికి సహకరించిన రైల్వేకోడూరు నియోజకవర్గ ప్రజానీకానికి అన్ని పార్టీల నాయకులకు కార్యకర్తలకు భక్తులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నానని ఆయన అన్నారు.

# నిరంతరం అప్రమత్తంగా వ్యవహరించాలి





**-జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్**
**-సీఎం పర్యటనకు భారీ ఏర్పాట్లు**
**- 900 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో కట్టుదిట్టమైన భద్రత**
**-భద్రత ఏర్పాట్లను స్వయంగా పరిశీలించిన జిల్లా ఎస్పీ**
**- కొత్త బురుజు గ్రామ పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ నిర్వహిస్తున్న స్పెషల్ పోలీస్ బలగాలు**
**- సీసీ, డ్రోన్ కెమెరాలతో నిఘా కట్టుదిట్టం**

**నంద్యాల ప్రతినిధి, మార్చి 08 (డ్రీమ్ టైమ్స్)**
నంద్యాల జిల్లా డోన్ మండలం కొత్తబురుజు గ్రామంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం పర్యటించనున్న సందర్భంగా సుమారు 900 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ తెలిపారు. సీఎం పర్యటించే ప్రదేశాలలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయడంతో పాటు ఇప్పటికే కొత్త బురుజు గ్రామ పరిసర ప్రాంతాలను స్పెషల్ పార్టీ బృందాలు క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టినట్లు ఎస్పీ తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలలో పోలీస్ జాగిలాలు, బాంబు





డిటెక్షన్ టీం సహాయంతో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు. సీసీ, డ్రోన్ కెమెరాలతో నిరంతరం భద్రతా పర్యవేక్షణ జరుగుతుందని, కొత్తబురుజు గ్రామంలో నిర్వహించే సభా ప్రాంగణానికి ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు వచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి ట్రాఫిక్ అంతరాయం లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవడంతో పాటు వాహనాల పార్కింగ్ సమయంలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సిబ్బందిని నియమించినట్లు వివరించారు. బందోబస్తుకు వచ్చిన అధికారులను, సిబ్బందిని సమావేశపరిచి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత నిర్వహించాలని ఆదేశించారు. డ్యూటీ ప్రదేశాన్ని వదిలి వెళ్ళరాదని, ప్రజలు ఎక్కువగా తరలివచ్చే అవకాశం ఉన్నందున విధులు నిర్వహించు ప్రాంతంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతరం అప్రమత్తతో విధులు నిర్వహించాలన్నారు.

# మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా మణులకు ఘన సన్మానం



**చిట్వేల్ మార్చి 8 డ్రీమ్ టైమ్స్**
: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మండలంలోని సి.కందులు వారి పల్లి గ్రామపంచాయతీ పరిధిలో సేవలందిస్తున్న మహిళా సిబ్బందిని ఘనంగా సత్కరించారు. గ్రామాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న స్వర్ణ గ్రామం సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, వెలుగు వివోఏలు, ఆశా కార్యకర్తలను శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలతో సన్మానించారు.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన చిట్వేల్ మండల టిడిపి పార్టీ అధ్యక్షులు కాకర్ల నాగార్జున నాయుడు మాట్లాడుతూ సృష్టి ఆరంభం నుంచి నేటి ఆధునిక సమాజం వరకు మహిళల పాత్ర అపారమని అన్నారు. కుటుంబం నుంచి సమాజ అభివృద్ధి వరకు ప్రతి రంగంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. మహిళల త్యాగం, ఓర్పు, సహనం సమాజానికి ఆదర్శమని పేర్కొన్నారు. మండల సీనియర్ టిడిపి నాయకులు బాలు రామాంజులు మాట్లాడుతూ మనిషి పుట్టుక నుంచి జీవితాంతం వరకు నిస్వార్థంగా సేవచేసేది మహిళేనని కొనియాడారు. మహిళల కృషి వల్లే కుటుంబ వ్యవస్థ బలపడుతుందని అన్నారు. ఈ సందర్భంగా చిట్వేల్ మండల పంచాయతీ డిప్యూటీ ఎంపీడీవో నస్రిన్ బేగం, సి.కందులు వారి పల్లి సర్పంచ్ యామల శ్రీదేవిలను ప్రత్యేకంగా శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. మహిళల సాధికారతకు ప్రభుత్వం మరియు స్వచ్ఛంద సంస్థలు చేపడుతున్న కార్యక్రమాల గురించి కూడా వివరించారు.
ఈ కార్యక్రమంలో స్వర్ణ గ్రామం డిప్యూటీ ఎంపీడీవో అనిల్ కుమార్, సీనియర్ పంచాయతీ డెవలప్మెంట్ ఆఫీసర్ రమణయ్య, సి.కందులు వారి పల్లి పంచాయతీ డెవలప్మెంట్ ఆఫీసర్ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల్లోకి విస్తృతంగా వజ్రప్రహార్ కార్యక్రమం





**రైల్వేకోడూరు, మార్చి 08, డ్రీమ్ టైమ్స్ న్యూస్**
తిరుపతి జిల్లా పోలీసు అధికారి ఎల్. సుబ్బరాయుడు ఐపిఎస్ ఉత్తర్వుల మేరకు, రేణిగుంట డిఎస్పీ వై. శ్రీనివాస్ రావు ఆదేశాల ప్రకారం, గంజాయి నిర్మూలనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ "వజ్ర ప్రహర్" కార్యక్రమంలో భాగంగా రైల్వే కోడూరు రూరల్ సీఐ శ్రీనివాసులు మరియు రైల్వే కోడూరు అర్బన్ సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో, ఓబులవారిపల్లి ఎస్సై పి. మహేష్, చిట్వేల్ ఎస్సై వినోద్, రైల్వే కోడూరు ఎస్సై ప్రసాద్ రెడ్డి మరియు రైల్వే కోడూరు రూరల్ సిబ్బంది కలిసి పుల్లంపేట ఓబులవారిపల్లి మండలం వత్తులూరు వడ్డిపల్లి గ్రామంలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లో ముఖ్యంగా గంజాయి అక్రమ రవాణా, నిల్వ మరియు వినియోగాన్ని అరికట్టడంపై ప్రత్యేక దృష్టి సారించి, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు మరియు గృహాలను సమగ్రంగా తనిఖీ చేయడం జరిగింది. గంజాయి వంటి మాదక ద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేయడంతో పాటు సమాజంలో నేరాల పెరుగుదలకు కారణమవుతున్నందున, వాటి నిర్మూలనకు పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నారు. అదేవిధంగా, ప్రజలకు గంజాయి అమ్మకం, నిల్వ మరియు వినియోగం చట్టవిరుద్ధమని, అలాంటి కార్యకలాపాల్లో పాల్గొనే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని అవగాహన కల్పించారు. గంజాయి సంబంధిత సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 100 కు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. అలాగే మహిళలపై నేరాలు, బాల్య వివాహాలు, సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనలు మరియు దొంగతనాల నివారణపై కూడా అవగాహన కల్పించారు. జిల్లాలో గంజాయి నిర్మూలన మరియు శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తూ నిరంతరం ప్రత్యేక ఆపరేషన్లు నిర్వహిస్తుందని అధికారులు తెలిపారు. ప్రజలు పోలీసులకు సహకరించి గంజాయి రహిత సమాజ నిర్మాణానికి తోడ్పడాలని కోరారు.

# వైసిపి పార్టీ నుండి 30 కుటుంబాలు టిడిపిలో చేరిక

**డోన్ మార్చి 08 (డ్రీమ్ టైమ్స్)**
మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నారాయణ మూర్తి ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్యాపిలి మండలంలోని నేరేడుచర్లకు చెందిన వెంకటేశ్వర్లు,తో పాటు రాచర్ల రామచంద్ర రెడ్డి తదితరులతో కలిసి సుమారు 30 కుటుంబాలు వైసిపి పార్టీ వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా డోన్ శాసనసభ్యులు కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి కొత్తగా పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి హర్షపూర్వకంగా ఆహ్వానించారు. రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు మరియు సంక్షేమ పథకాలపై విశ్వాసంతోనే ప్రజలు పెద్ద ఎత్తున పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు

# టీడీపీ కోటకు ఎదురుదెబ్బ.

**శిరివెళ్ళ ( మార్చి 08 (డ్రీమ్ టైమ్స్)**
మండల పరిధిలోని నల్లమల అడవి సమీప గ్రామం మహదేవపురంలో అధికార తెలుగుదేశం పార్టీ కోటకు ఎదురుదెబ్బ వాటిల్లింది. అధికార పార్టీ నేతలు గ్రామంలో చేస్తున్న అక్రమాలు అన్యాయాలపై మహదేవపురం గ్రామంలోని ప్రజలు విసుగు చెంది ప్రజాప్రతినిధులను నిలదీయడం వల్ల ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబించడం దేవుడి సొమ్ముతో ఆటలాడవద్దని ఎంత చెప్పినా వినని అధికార పార్టీ నేతల వైఖరికి నిరసనగా గ్రామంలో రాజకీయ సమీకరణలు ఒక్కసారిగా మారిపోయాయి. వైసిపి యూత్ నేత కంపరాజు రాజేష్ గౌడ్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీకి చెందిన ఎంపీటీసీ వార్డు మెంబర్లు మరియు టిడిపి కార్యకర్తలు సుమారు 200 మంది రాజేష్ గౌడ్ ఆధ్వర్యంలో వైసిపిలో చేరేందుకు సంసిద్ధం అయ్యారు.గ్రామ ప్రజల ఒత్తిడి మరియు నిర్ణయం మేరకు రాజేష్ గౌడ్ కర్నూలు నంద్యాల ఉమ్మడి జిల్లాల వైసిపి పరిశీలకులు గంగుల ప్రభాకర్ రెడ్డి దృష్టికి జిల్లా ఆళ్లగడ్డ అసెంబ్లీ మాజీ ఎమ్మెల్యే గంగుల భీజేంద్రరెడ్డి దృష్టికి తీసుకు వెళ్ళారు.ఈ నేపథ్యంలో కర్నూలు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు , రాయలసీమ సీనియర్ పొలిటీషియన్ పెద్దాయన గంగుల ప్రభాకర్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే గంగుల.బ్రిజేంద్రరెడ్డి (నాని) అన్న గ సమక్షంలో వైయస్ఆర్ ర్ పార్టీ కండువాని కీలక నేతలు ప్రముఖులు కప్పుకున్నారు. ఈ క్రమంలో మహదేవపురం



తెలుగుదేశం పార్టీకి భారీ షాక్ తగిలింది గ్రామానికి చెందిన పలువురు ముఖ్య నాయకులు టీడీపీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఎక కాలంలో సుమారు 200 మంది వైసిపి లో చేరి పార్టీ కండువ కప్పుకున్నారు. దాదాపు సుమారు 200 మంది తెలుగుదేశం పార్టీ ప్రజా ప్రతినిధులు ముఖ్య అనుచరులు ఒకేసారి పార్టీ మారడంతో మహాదేవపురం గ్రామంలో కంపరాజు రాజేష్ గౌడ్ ఆధ్వర్యంలో వైసీపీలో సంబరాలు అంబరాన్ని అంటాయి .తెలుగు దేశం పార్టీ శ్రేణులు డీలా పడ్డాయి.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు కర్నూలు జిల్లా పర్యటనకు వస్తున్న నేపథ్యంలో కార్లు బాడుగకు అందుబాటులో లేకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి సైతం సుమారు 30 వాహనాలను మహదేవపురం గ్రామానికి రప్పించి వైసిపిలో చేరే గత తెలుగుదేశం పార్టీ ప్రజాప్రతినిధులను ప్రముఖులను కార్యకర్తలను కంపరాజు రాజేష్ గౌడ్ ఆళ్లగడ్డకు తరలించారు.రాజేష్ గౌడ్ ఆధ్వర్యంలో గంగుల సమక్షంలో పార్టీలో చేరిన వారిని గంగుల ప్రభాకర్ రెడ్డి గంగుల బిజేంద్రారెడ్డి ప్రేమపూర్వకంగా ఆహ్వానించి పార్టీ కండువా కప్పి వైసీపీ తీర్థం అందజేశారు.
ఈ సందర్భంగా పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక గుర్తింపు ఉంటుందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అండదండగా నిలుస్తుందని తెలియజేశారు.మహదేవపురం గ్రామం నుండి 30 వాహనాలలో సుమారు 200 మందికి పైగా ప్రజలు తరలి రావడం వల్ల మార్గమధ్యంలో ఎటువంటి అవాంతరాలు ఆటంకం ఎదురుకాకుండా కెమెరాల మధ్య ఆళ్లగడ్డకు చేరుకున్నట్లు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మండల వైసిపికన్వీనర్ ఇందూరి ప్రతాప్ రెడ్డి, జిల్లా వైసీపీ వైస్ ప్రెసిడెంట్.అబ్దుల్ సలాం, ఎంపీపీ . నాయక్ మహమ్మద్ వసీం, పిక్కిలి నరహరి, మహాదేవ పురం ,గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ, పలువురు వైసిపి నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మహిళా సాధికారతతోనే సమాజాభివృద్ధి





**- మంత్రులు ఫరూక్, బీసీ**

**నంద్యాల ప్రతినిధి, మార్చి 08 (డ్రీమ్ టైమ్స్)**
సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో మహిళలు ముందుకు రావడమే సమాజ పురోగతికి పునాది అని జిల్లా మంత్రులు ఎన్ఎండి ఫరూక్, బీసీ జనార్దన్ రెడ్డిలు పేర్కొన్నారు. ఆదివారం నంద్యాల పట్టణంలోని మునిసిపల్ టౌన్ హాలులో ఆదివారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకల్లో మంత్రులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ చదువు మనిషి జీవితాన్ని మార్చగల శక్తి అని పేర్కొన్నారు. విద్య లేనివాడు ప్రపంచంలో అవకాశాలను సద్వినియోగం చేసుకోలేడని, ప్రతి కుటుంబం పిల్లల విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా మహిళల విద్యాభివృద్ధి ఇంకా పెరగాల్సిన అవసరం ఉందని, గ్రామీణ ప్రాంతాల్లో మహిళల చదువును ప్రోత్సహించాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. ఇంజనీరింగ్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినప్పటికీ ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తున్న యువతలో చాలా మంది మహిళలే ఉన్నారని తెలిపారు. వివాహం అయిన తర్వాత కూడా పిల్లలను చూసుకుంటూ చదువు కొనసాగిస్తూ పరీక్షలకు హాజరవుతున్న మహిళల పట్టుదల అభినందనీయం అన్నారు. గత కొన్నేళ్లుగా నిలిచిపోయిన డీఎస్సీ పరీక్షలను మళ్లీ నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. ఉపాధ్యాయ నియామకాల ప్రక్రియ ప్రారంభం కావడం వల్ల యువతకు మంచి అవకాశాలు కలుగుతాయని చెప్పారు. ఇటీవల నిర్వహించిన పరీక్షలకు హాజరైన అభ్యర్థుల్లో మహిళలు అధిక శాతం ఉండటం మహిళల చైతన్యాన్ని సూచిస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం దేశంలో జనన రేటు తగ్గిపోతున్న నేపథ్యంలో మానవ వనరుల అభివృద్ధి ఎంతో కీలకమని మంత్రి తెలిపారు. యువత సంఖ్య








పెరిగితేనే దేశ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని, సమతుల్య జనాభా దేశ అభివృద్ధికి అవసరమని పేర్కొన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం బ్యాంకింగ్ వ్యవస్థ ద్వారా వేల కోట్ల రూపాయల సహాయాన్ని అందిస్తోందని ఆయన తెలిపారు. మహిళలు స్వయం ఉపాధి ద్వారా కుటుంబాలను నిలబెట్టడమే కాకుండా సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. ఒక ముస్లిం మహిళ తన కృషితో సంవత్సరానికి దాదాపు రూ.36 లక్షల ఆదాయం సంపాదిస్తూ వందలాది మందికి ఉపాధి కల్పిస్తోందని ఈ సందర్భంగా మంత్రి ప్రస్తావించారు. ఇలాంటి మహిళలు సమాజానికి ప్రేరణగా నిలుస్తారని, వారిని ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఆడపిల్లల వివాహాల కోసం 'షాదీ ముబారక్' వంటి పథకాల ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన పేద కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందని మంత్రి వివరించారు. మహిళల సంక్షేమం, భద్రత కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. ఒక ఇంటి నిర్మాణంలోనే అనేక రకాల పనులు ఉంటాయని, వాటిని నేర్చుకుంటే స్థానిక యువతకు మంచి ఆదాయం లభిస్తుందని సూచించారు. యువత నైపుణ్యాలను పెంపొందించుకుని అందుబాటులో ఉన్న అవకాశాలను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

**మహిళల పురోగతే నిజమైన అభివృద్ధి:**
రోడ్లు, భవనాలు శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మహిళా సాధికారత కోసం ముఖ్యమంత్రి నాయకత్వంలో ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. ఉచిత బస్సు సౌకర్యం, తల్లికి వందనం కార్యక్రమం, ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ వంటి పథకాల ద్వారా మహిళలకు ఉపశమనం కల్పిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే మహిళలు వ్యవసాయం, వ్యాపారం, స్వయం ఉపాధి వంటి అనేక రంగాల్లో పురుషులతో సమానంగా ముందుకు సాగుతున్నారన్నారు. ఒకప్పుడు ఇంటికే పరిమితమైన మహిళలు ఇప్పుడు ఎంటర్‌ప్రెన్యూర్లుగా రాణిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. మహిళలు తమలోని ప్రతిభను వెలికి తీసుకుని మరింత ఉన్నత స్థాయిలో రాణించాలని మంత్రి ఆకాంక్షించారు. అంతకుముందు మంత్రులు స్వయం సహాయక సంఘాల మహిళలు ప్రదర్శించిన స్టాళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో స్త్రీ శిశు సంక్షేమ అభివృద్ధి అధికారి లీలావతి, మున్సిపల్ కమిషనర్ శేషన్న, డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీధర్ రెడ్డి, మెప్మా పీడీ వెంకట దాసు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# బిజినెస్

## ఈ లోన్లు మహిళల కోసమే.. ప్రభుత్వ రుణ పథకాలను పరిశీలిద్దామా!

ప్రధాన మంత్రి ముద్ర యోజన పూచీకత్తు లేకుండా వాణిజ్య, తయారీ, సేవా రంగాలకు చెందిన సూక్ష్మ, చిన్న సంస్థలు ఈ పథకం కింద గరిష్ఠంగా రూ. 20 లక్షలదాకా రుణాలు పొందవచ్చు. ఇందులో శిశు, కిశోర్, తరుణ్, తరుణ్ ప్లస్ అనే నాలుగు విభాగాలుంటాయి. శిశు కింద రూ. 50 వేలదాకా, కిశోర్‌లో రూ. 50 వేల నుంచి రూ. 5 లక్షల వరకు, తరుణ్‌లో రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షల వరకు లోన్లు తీసుకోవచ్చు. ఒకసారి తరుణ్ కేటగిరీలో లోన్ తీసుకుని చెల్లిస్తే.. తరుణ్ ప్లస్ విభాగం కింద మళ్లీ రూ. 20 లక్షలదాకా లోన్‌కు అర్హులవుతారు. వడ్డీపైనా రాయితీలుంటాయి.

స్టాండప్ ఇండియా గ్రీన్‌ఫీల్డ్ సంస్థల్ని ప్రారంభించేందుకు మహిళా ఆంత్రప్రెన్యూర్స్‌కు రూ. 10 లక్షల నుంచి కోటి రూపాయల మధ్య రుణ



సదుపాయం కల్పిస్తారు.

ఉద్యోగిణి గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా ఆంత్రప్రెన్యూర్స్‌కు పూచీకత్తు లేకుండా రాయితీ వడ్డీపై రూ. 3 లక్షలదాకా రుణాలిస్తారు.

మహిళా ఉద్యమ్ నిధి అనువైన చెల్లింపు పద్ధతుల్లో చిన్నచిన్న వ్యాపారాలను ప్రారంభించేందుకు మహిళలకు ఈ పథకంలో రుణాలుంటాయి.

అన్నపూర్ణ ఫుడ్ క్యాటరింగ్ రంగంలోని మహిళల కోసం ఉద్దేశించిన పథకం.

న్యూ స్వర్ణిమ వెనుకబడిన తరగతులకు చెందిన మహిళల అభ్యున్నతికి తక్కువ వడ్డీకే రూ. 2 లక్షలదాకా రుణ సాయం అందుతుంది.

మహిళా సమృద్ధి యోజన 4 శాతం వార్షిక వడ్డీతో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారికి, వెనుకబడిన తరగతి మహిళలకు సూక్ష్మ రుణాలు లభిస్తాయి.

ఎస్బీఐ ద్వారా స్త్రీ శక్తి యోజన, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా సెంట్ కల్యాణి స్కీమ్‌లున్నాయి. చిన్న, సూక్ష్మ వ్యాపారాలకు తక్కువ వడ్డీకే పూచీకత్తు లేని రుణాలు వస్తాయి.

ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తదితర బ్యాంకులూ వివిధ పథకాల ద్వారా మహిళలకు ఆకర్షణీయ వడ్డీరేట్లకే రూ. 75 లక్షల నుంచి కోటిదాకా రుణాలిస్తున్నాయి.

## ఎన్‌పీఎస్ స్వస్థ్యతో వైద్య నిధి



పెరుగుతున్న వైద్య ఖర్చులను అధిగమించేందుకు తమ ఖాతాదారుల కోసం నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్) స్వస్థ్య పేరిట పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్‌ఆర్డీఏ) ఓ పైలట్ ప్రాజెక్ట్‌ను తీసుకొచ్చింది. ఈ స్వచ్ఛంధ పథకం ద్వారా మీ పెన్షన్ ఖాతా పరిధిలోనే ప్రత్యేకంగా ఓ ఆరోగ్య సంరక్షణ నిధిని నిర్మించుకోవచ్చు. ఎన్‌పీఎస్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ నిధిలో నగదు మొత్తాల జమ ఉంటుంది. దీనికి మార్కెట్ ఆధారిత వృద్ధిని చూడవచ్చు. అయితే ఒకవేళ ఈ పెట్టుబడులపై వచ్చే రాబడులు ఆశించిన స్థాయిలో ఉండకపోతే మీ నిధులను మళ్లీ మీ ప్రధాన ఎన్‌పీఎస్ ఖాతాలోకి ఎలాంటి నష్టం లేకుండా బదిలీ కూడా చేసుకోవచ్చు. ఇక రెగ్యులర్ ఎన్‌పీఎస్ ఖాతా కలిగిన భారత పౌరులు ఎవరైనా దీనికి అర్హులే. వైద్య అవసరాల కోసం ఎప్పుడైనా ఎలాంటి ఆంక్షలు లేకుండా నగదు ఉపసంహరణలు చేసుకోవచ్చు. అత్యవసర పరిస్థితుల్లో నిబంధనలకు లోబడి 100 శాతం నగదును వెనుకకు తీసుకోవచ్చు. ఈ స్కీమ్‌లో కార్పస్ ఫండ్ రూ. 50 వేలు దాటితేనే తొలి ఉపసంహరణకు అవకాశం ఉంటుంది.

## హెచ్‌డీఎఫ్‌సీ రుణాలు చౌక

న్యూఢిల్లీ, మార్చి 8

ప్రైవేట్ బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్..రుణ గ్రహీతలకు శుభవార్తను అందించింది. మార్జినల్ కాస్ట్ ఆఫ్ లెండింగ్ రేటు(ఎంసీఎల్‌ఆర్)ను 10 బేసిస్ పాయింట్లు తగ్గిస్తున్నట్టు ప్రకటించింది. ఈ తగ్గింపు శనివారం నుంచి అమల్లోకి వచ్చిందని పేర్కొంది. బ్యాంక్ తీసుకున్న తాజా నిర్ణయంతో ఒక్కరోజు నుంచి మూడేండ్ల లోపు కాలపరిమితి కలిగిన రుణాలు మరింత చౌకగానున్నాయి. దీంతో బ్యాంక్ ఎంసీఎల్‌ఆర్ రేటు 8.15 శాతం నుంచి 8.55 శాతం లోపు దిగొచ్చాయి. అంతకుముందు ఇది 8.25 శాతం నుంచి 8.60 శాతం లోపు ఉండేది. దీంతో ఎంసీఎల్‌ఆర్‌తో అనుసంధానమైన రుణాలపై వడ్డీరేట్లు మరింత తగ్గనున్నాయి.





**ఎఫ్‌డీలపై వడ్డీ పెంపు**

డిపాజిట్‌దారులకు కూడా బ్యాంక్ ఊరటనిచ్చింది. ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీరేటును 10 బేసిస్ పాయింట్లు పెంచుతున్నట్టు ప్రకటించింది. దీంతో డిపాజిట్లపై బ్యాంక్ వడ్డీరేటు 2.75 శాతం నుంచి 6.50 శాతం వరకు సాధారణ ఖాతాదారులకు చెల్లించనుండగా, సీనియర్ సిటిజన్లకు 3.25 శాతం నుంచి 7 శాతం లోపు చెల్లించనున్నది. అలాగే మూడేండ్ల నుంచి నాలుగేండ్ల ఏడు నెలల్లోపు కాలపరిమితి కలిగిన డిపాజిట్లపై వడ్డీరేటును 10 బేసిస్ పాయింట్లు సవరించింది. దీంతో డిపాజిట్లపై వడ్డీరేటు 6.40 శాతం నుంచి 6.50 శాతానికి పెరిగింది. రూ. 3 కోట్ల లోపు టర్మ్ డిపాజిట్లకు మాత్రమే పెరిగిన వడ్డీరేటు వర్తించనున్నదని పేర్కొంది.

# స్పోర్ట్స్

## ప్రేయసితో నిశ్చితార్థం.. 'నా పర్ఫెక్ట్ ఇన్నింగ్స్' అంటున్న భారత క్రికెటర్..!

భారత జట్టుకు దూరమైనా.. దేశవాళీలో మెరుస్తున్న పృథ్వీ షా త్వరలోనే ఇంటివాడు కాబోతున్నాడు. కొన్ని రోజులుగా ఇన్‌ఫ్లుయెన్సర్ ఆకృతి అగర్వాల్ తో ప్రేమలో మునిగి తేలుతున్న ఈ డాషింగ్ బ్యాటర్ నిశ్చితార్థం చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు, ఆత్మీయుల సమక్షంలో ఆదివారం వీరిద్దరి ఎంగేజ్‌మెంట్ వైభవంగా జరిగింది. సినిమా నటి అయిన ఆకృతికి ఉంగురం తొడిగిన ఫొటలోను ఈ డాషింగ్ బ్యాటర్ సోషల్ మీడియా వేదికగా పంచుకున్నాడు. నా పర్ఫెక్ట్ ఇన్నింగ్స్ అనే క్యాప్షన్ జోడించాడు షా. ఇటీవల కాలంలో ఆటకంటే వివాదాలతోనే ఎక్కువగా వార్తల్లో నిలిచిన పృథ్వీ షా ఎంగేజ్‌మెంట్ ఫొటోలతో మరోసారి నెట్టింట వైరలవుతున్నాడు. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ ఆకృతి అగర్వాల్‌తో పలు సందర్భాల్లో కెమెరా కంటపడిన



షా.. ఎట్టకేలకు తమ బంధాన్ని బహిర్గతం చేశాడు. తాజాగా సచిన్ తనయుడు అర్జున్ టెండూల్కర్ పెళ్లితో జంటగా తళుక్కమన్న ఆకృతి, పృథ్వీ షా ఆదివారం నిశ్చితార్థంతో పెళ్లికి వేళైందని సిగ్నల్ ఇచ్చారు. లేత నీలం రంగు షేర్వానీలో షా మెరిసిపోగా.. ఎర్రని డిజైనర్ లెహెంగా ధరించిన ఆకృతి దేవకన్యలా వయ్యారాలు పోయింది. ఈమధ్యే త్రిముఖ సినిమాతో బాలీవుడ్‌లో అరంగేట్రం చేసిన ఆకృతిని ఇన్‌స్టాగ్రామ్‌లో 30 లక్షల మందికి పైగా అనుసరిస్తున్నారు. జూనియర్ స్థాయిలో సంచలన ఆటతో మరో సచిన్ టెండూల్కర్‌గా ప్రశంసలందుకున్న పృథ్వీ షా.. ఊహించని విధంగా పాతాళానికి పడిపోయాడు. క్రమశిక్షణ కరువై, ఫిట్‌నెస్, ఫామ్ కోల్పోవడంతో అతడి కెరీర్ ప్రశ్నార్థకంగా మారింది. ఐపీఎల్‌లోనూ నిరాశపరిచిన షా.. ఎట్టకేలకు దేశవాళీ సీజన్ 2025-26తో టచ్‌లోకి వచ్చాడు. ముంబై నుంచి మహారాష్ట్ర జట్టుకు మారిన అతడు.. పరుగుల వరదతో లయ అందుకున్నాడు. దాంతో.. ఐపీఎల్ 19వ సీజన్ మినీ వేలంలో షాను కనీస ధరకే ఢిల్లీ క్యాపిటల్ దక్కించుకుంది.

## నా సక్సెస్ వెనుక 'సచిన్' మంత్రం..




2026 టీ20 ప్రపంచకప్‌లో టీమిండియా సగర్వంగా మువ్వన్నెల జెండాను ఎగురవేసింది. ఫైనల్‌లో న్యూజిలాండ్‌పై 96 పరుగుల భారీ తేడాతో గెలిచి భారత్ విశ్వవిజేతగా నిలిచింది. ఈ టోర్నీలో భారత్ తరపున వెలుగులీనిన ధృవతార సంజూ శాంసన్. వరుసగా మూడు మ్యాచ్‌ల్లో 80కి పైగా పరుగులు సాధించి, ఫైనల్‌లో కేవలం 46 బంతుల్లో 89 పరుగులు చేసిన సంజూను 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్' వరించింది.

**సచిన్ సలహాతోనే ఈ మార్పు..**

మ్యాచ్ అనంతరం తన అద్భుత ఫామ్ గురించి సంజూ శాంసన్ ఆసక్తికర విషయాలను పంచుకున్నాడు. తన బ్యాటింగ్‌లో నిలకడ లేదనే విమర్శలకు చెక్ పెట్టడానికి క్రికెట్ గాడ్ సచిన్ టెండూల్కర్ సలహాలే కారణమని వెల్లడించాడు. ఈ క్రమంలో శాంసన్ మాట్లాడుతూ..

'టోర్నీకి ముందు నేను మానసికంగా కొంత ఒత్తిడిలో ఉన్నాను. ఆ సమయంలో సచిన్ సార్‌కు ఫోన్ చేశాను. ఆయన నా బ్యాటింగ్ పొజిషన్, మెంటల్ అప్రోచ్ గురించి కొన్ని విలువైన సూచనలు చేశారు. బంతిని చూసి సహజ సిద్ధంగా ఆడమని ఆయన చెప్పిన మాటలు నాలో ఆత్మవిశ్వాసాన్ని నింపాయి," అని సంజూ పేర్కొన్నాడు.

**నిలకడకు మారుపేరుగా..**

గతంలో మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడి వెంటనే అవుట్ అయ్యే సంజూ, ఈ టోర్నీలో మాత్రం బాధ్యతాయుతమైన ఆటతీరును ప్రదర్శించాడు. ఫైనల్‌లో న్యూజిలాండ్ బౌలర్లను ఫోర్లు, సిక్సర్లతో విరుచుకుపడుతూనే, ఇన్నింగ్స్‌ను చక్కగా నిర్మించాడు. ఫలితంగా భారత్ భారీ స్కోరు సాధించి, కివీస్‌ను కట్టడి చేయగలిగింది.


సచిన్ మార్గదర్శకత్వం, సంజూ ప్రతిభ తోడవ్వడంతో టీమిండియా మరో ఐసీసీ ట్రోఫీని తన ఖాతాలో వేసుకుంది

## లక్ష్యసేన్ రన్నరప్

- ఫైనల్లో లిన్ చున్ చేతిలో ఓటమి

**బర్మింగ్‌హామ్ (ఇంగ్లాండ్)**

ప్రతిష్టాత్మక ఆల్ ఇంగ్లాండ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్స్‌లో భారత అగ్రశ్రేణి షట్లర్, ఒలింపియన్ లక్ష్యసేన్‌కు మరోసారి నిరాశే ఎదురైంది. 2022లో టైటిల్‌కు అడుగు దూరంలో ఆగిపోయిన లక్ష్యసేన్.. 2026లోనూ రన్నరప్‌తోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో చైనీస్ తైపీ షట్లర్ లిన్ చున్ చేతిలో లక్ష్యసేన్ వరుస గేముల్లో ఓటమి చెందాడు. 15-21, 22-20తో లిన్ చున్ టైటిల్ సొంతం చేసుకున్నాడు. 57 నిమిషాల్లో ముగిసిన ఫైనల్లో లక్ష్యసేన్ ఆశించిన ప్రదర్శన కనబరచలేదు. రెండో గేమ్‌లో ప్రత్యర్థిని ఒత్తిడిలో పడేసిన లక్ష్యసేన్.. లిన్ చున్ తప్పిదాలు చేసేలా



ఉసిగొల్పాడు. 3-4 నుంచి వరుసగా ఆరు పాయింట్లు సాధించిన లక్ష్యసేన్ 9-4తో ముందంజ వేశాడు. లిన్ చున్ వేగంగా పుంజుకున్నాడు. టైబ్రేకర్‌కు దారితీసిన రెండో సెట్‌ను 22-20తో సొం తం చేసుకున్న లిన్ చున్ ఆల్ ఇంగ్లాండ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌గా నిలిచాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో హాంగ్ వీ, నికోలె (చైనీస్ తైపీ) జోడీ విజేతగా నిలువగా.. మహిళల డబుల్స్‌లో షెంగ్, టాన్ నింగ్ (చైనా) జంట టైటిల్ ఎగరేసుకుపోయింది.



## రణ్‌వీర్ సింగ్ 'ధురంధర్ 2'
# తెలుగు ట్రైలర్ విడుదల


రణ్‌వీర్ సింగ్ కథానాయకుడిగా, సంచలన దర్శకుడు ఆదిత్య ధర్ దర్శకత్వంలో తెరకెక్కిన అత్యంత భారీ యాక్షన్ ఎంటర్టైనర్ 'ధురంధర్ 2' (ది రివెంజ్) ట్రైలర్‌ను చిత్రబృందం శనివారం విడుదల చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ సినిమా తెలుగు వెర్షన్ ట్రైలర్‌ను తాజాగా వదిలింది చిత్రయూనిట్. గతేడాది బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టించిన 'ధురంధర్' చిత్రానికి సీక్వెల్‌గా వస్తున్న ఈ ట్రైలర్‌లో రణ్‌వీర్ సింగ్ 'హంజా' మరియు 'జస్కిరత్ సింగ్ రంగీ' అనే రెండు శక్తివంతమైన లుక్స్‌లో కనిపించి అభిమానులను ఆకట్టుకుంటున్నారు.హాలీవుడ్ స్థాయి విజువల్స్, హై-వోల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్‌లతో నిండిన ఈ ట్రైలర్‌లో "పాకిస్థాన్ భవిష్యత్తును ఇప్పుడు ఇండియా నిర్ణయిస్తుంది" వంటి డైలాగులు సోషల్ మీడియాను ఊపేస్తున్నాయి. ఇందులో సంజయ్ దత్, అర్జున్ రాంపాల్, ఆర్. మాధవన్ వంటి భారీ తారాగణం కీలక పాత్రలు పోషిస్తుండగా, సంజయ్ దత్ చెప్పిన సంభాషణలు సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతున్నాయి. ఈ చిత్రం ఉగాది, మరియు ఈద్ కానుకగా మార్చి 19, 2026న తెలుగు, హిందీతో పాటు ప్రధాన భారతీయ భాషల్లో విడుదల కానుంది. దాదాపు 3 గంటల 55 నిమిషాల సుదీర్ఘ నిడివితో వస్తున్న ఈ సినిమా కోసం మార్చి 18 సాయంత్రం 5 గంటల నుండే పెయిడ్ ప్రివ్యూలు ప్రారంభం కానున్నాయి.



**బ్లాక్ డ్రెస్ లో నిధి అగర్వాల్ కవ్వింత..**

# మంచు కొండల్లో భారీ యాక్షన్ సీక్వెన్స్

**మహేష్ బాబు-రాజమౌళి 'వారణాసి' షూటింగ్ వేగం పెరిగింది..**




టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు మరియు దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం 'వారణాసి' ప్రస్తుతం భారతీయ సినిమా రంగంలోనే అత్యధిక అంచనాలు పొందుతున్న ప్రాజెక్ట్‌గా మారింది. ఈ గ్లోబల్ అడ్వెంచర్ మూవీకి సంబంధించిన ప్రతి చిన్న అప్‌డేట్ కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ముఖ్యంగా మహేష్ బాబు, విలన్ పాత్రలో నటిస్తున్న పృథ్వీరాజ్ సుకుమారన్, అలాగే హీరోయిన్ ప్రియాంక చోప్రా వివిధ ఇంటర్వ్యూలలో చెబుతున్న విషయాలు అభిమానుల్లో సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతున్నాయి.ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన షూటింగ్ మంచు కొండల మధ్య జరుగుతోంది. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాలో మహేష్ బాబు మరియు పృథ్వీరాజ్ సుకుమారన్ మధ్య వచ్చే ఒక కీలక యాక్షన్ సీక్వెన్స్‌ను రాజమౌళి అక్కడ చిత్రీకరిస్తున్నారని సమాచారం. ఈ యాక్షన్ సన్నివేశం సినిమా మొత్తంలో హైలైట్‌గా నిలవబోతుందని చిత్ర యూనిట్ చెబుతోంది. అంతర్జాతీయ స్థాయి యాక్షన్‌ను చూపించడానికి ప్రత్యేకంగా విదేశీ టెక్నీషియన్ల సహాయంతో ఈ సన్నివేశాలను రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ యాక్షన్ సీక్వెన్స్ కోసం హీరో మహేష్ బాబు కూడా ప్రత్యేకంగా ట్రైనింగ్ తీసుకున్నారని సమాచారం. ప్రమాదకరమైన స్టంట్స్‌ను మరింత సహజంగా కనిపించేలా రూపొందించేందుకు రాజమౌళి ప్రతి షాట్‌ను చాలా జాగ్రత్తగా ప్లాన్ చేస్తున్నారట. మంచు ప్రాంతాల్లో షూటింగ్ జరపడం చాలా కష్టమైన పని అయినప్పటికీ, చిత్ర యూనిట్ ఎంతో కష్టపడి ఈ సన్నివేశాలను చిత్రీకరిస్తోంది. ఇక షూటింగ్ షెడ్యూల్ విషయానికి వస్తే, జూన్ లేదా జూలై నాటికి మొత్తం చిత్రీకరణ పూర్తి చేయాలని దర్శకుడు రాజమౌళి ప్లాన్ చేస్తున్నారని తెలుస్తోంది. ఆ తర్వాత వెంటనే పోస్ట్ ప్రొడక్షన్ పనులను ప్రారంభించి, సినిమాను అత్యుత్తమ సాంకేతిక ప్రమాణాలతో సిద్ధం చేయాలని యూనిట్ భావిస్తోంది. విజువల్ ఎఫెక్ట్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, గ్రాఫిక్స్ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నారు. ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల చేయాలని ప్లాన్ చేసిన ఈ సినిమాను వచ్చే ఏడాది ఏప్రిల్ 7న రిలీజ్ చేయాలని నిర్మాతలు నిర్ణయించినట్లు సమాచారం. రాజమౌళి దర్శకత్వంలో వస్తున్న సినిమా కావడంతో ఈ చిత్రంపై అంతర్జాతీయ స్థాయిలో కూడా భారీ అంచనాలు నెలకొన్నాయి. మహేష్ బాబు కెరీర్‌లో ఇదే మొదటి గ్లోబల్ అడ్వెంచర్ సినిమా కావడంతో అభిమానులు కూడా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



# ఇండస్ట్రీ వాడు, బిజినెస్ మేన్ కాదు.. అలాంటి వాడే కావలి..

**- దొరికితే పెళ్లికి రెడీ అంటున్న మీను**

అందాల భామ మీనాక్షి చౌదరి ప్రస్తుతం వరుస సినిమాలతో దూసుకుపోతుంది. 2019లో ఓ హిందీ సినిమాలో చిన్న పాత్ర ద్వారా సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చింది ఈ ముద్దుగుమ్మ. ఆతర్వాత 2021లో టాలీవుడ్ లోకి హీరోయిన్ గా పరిచయం అయ్యింది. తొలి సినిమాతోనే అందరి దృష్టి ఆకర్షించింది ఈ వయ్యారి.. రవితేజ సినిమా ఖిలాడీ లో గ్లామరస్ గా కనిపించి అందరూ షాక్ అయ్యేలా చేసింది. ఆతర్వాత వరుస ఆఫర్స్ తో ఫుల్ బిజీగా మారిపోయింది. కెరీర్ స్టార్టింగ్ డేస్ లోనే రవితేజ, మహేష్ లాంటి స్టార్ హీరోల సినిమాల్లో నటించే అవకాశం అందుకున్న ఈ బ్యూటీకి లక్కీ భాస్కర్ సినిమాలో లక్ కలిసొచ్చింది. దుల్కర్ సల్మాన్ నటించిన ఆ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. దాంతో మీనాక్షికి బ్యాక్ టు బ్యాక్ ఆఫర్స్ క్యూ కట్టాయి. ఆఫర్స్ ఫుల్లుగానే ఉన్న ఈ భామ వచ్చిన హిట్స్ మాత్రం తక్కువే.. మొత్తంగా పది సినిమాల్లో నటిస్తే హిట్ అయ్యినవి నాలుగు సినిమాలే వాటిలో సంక్రాంతికి వస్తున్నాం సినిమా ఒకటి ఈ మూవీ ఎంత పెద్ద విజయం సాధించిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. రీసెంట్ గా అనగనగ ఓ రాజు సినిమాతో మరో హిట్ తన ఖాతాలో వేసుకుంది ఈ కుర్రభామ. కాగా 29ఏళ్ల ఈ సుందరిని పెళ్లి గురించి ఆసక్తికర వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. మీ తోటి హీరోయిన్స్ కు పెళ్లిళ్లు అయిపోతున్నాయి మరి మీ పెళ్ళెప్పుడు అంటూ అడిగిన ప్రశ్నలకు మీనాక్షి చాలా తెలివైన సమాధానం చెప్పింది. తనకు కాబోయే వాడు ఇండస్ట్రీవాడో.. లేక పెద్ద బిజినెస్ మాన్ అయ్యుండాల్సిన అవసరం లేదు అని.. వ్యవసాయం చేసే వాడు కావాలని చెప్పుకొచ్చింది. నన్ను పెళ్లి చేసికునేవాడు కనీసం 100 ఎకరాల ఆస్తి పరుడై ఉండాలి. వంట బాగా తెలిసినవాడై ఉండాలి. బట్టలు ఉతకడం, ఇస్త్రీ చేయడంలాంటి పనులు చేయాలి. ఇంట్లో అన్ని పనులు చూసుకోవాలి.. అలాంటి వాడు దొరికితే పెళ్ళికి రెడీ అంటూ మీనాక్షి చౌదరి చెప్పుకొచ్చింది. దాంతో ఈ క్వాలిటీస్ ఉన్న కుర్రాళ్ళు మీనాక్షి పెళ్లి రిక్వెస్ట్ లు పెట్టేస్తున్నారు.

# అమ్మే అసలైన స్ఫూర్తి!



బాల్యం నుంచీ అన్ని రకాలుగా అండగా నిలిచిన తన తల్లే.. తనకు స్ఫూర్తి అని చెబుతున్నది రకుల్‌ప్రీత్ సింగ్. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని తాజాగా, ఓ జాతీయ మీడియాతో మాట్లాడింది. జీవితంలో తనకు ప్రేరణగా నిలిచిన మహిళల గురించి ఈ సందర్భంగా చెప్పుకొచ్చింది. నేటితరం మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతున్నారనీ, ప్రతిరంగంలోనూ బలమైన ప్రభావాన్ని చూపుతున్నారనీ పేర్కొన్నది. "మన చుట్టూ ఉన్న మహిళలను అభినందించడం, వారి విజయాలను గుర్తించడం, వారి కలలకు మద్దతుతోపాటు బలాన్ని కూడా అందివ్వడమే.. మహిళా దినోత్సవ ఉద్దేశం" అంటూ తన అభిప్రాయాన్ని పంచుకున్నది. ఇక స్ఫూర్తిదాయకమైన మహిళలతో సమయం గడపడమే తనకు అత్యంత ఇష్టమైన వ్యాపకాల్లో ఒకటని వెల్లడించింది.ఈ సందర్భంగా ఓ ప్రశ్నకు సమాధానం ఇస్తూ.. తన తల్లే తనకు ప్రేరణ అని చెప్పుకొచ్చింది. "మా అమ్మే నాకు స్ఫూర్తి. నా బలం. ఆమే నాకు అతిపెద్ద ప్రేరణ. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా సానుకూలంగా ఉండటాన్ని మాకు బాల్యం నుంచే నేర్పించింది" అంటూ తల్లి గురించి తెలియజేసింది. ఆమెవల్లే ఈరోజు తాను ఈస్థితిలో ఉన్నాననీ వెల్లడించింది. "మా అమ్మ చిన్నప్పటి నుంచే నాకు కష్టపడి పనిచేయడం, నన్ను నేను నమ్ముకోవడం నేర్పింది. ఎల్లప్పుడూ నాపై ఎంతో నమ్మకం ఉంచేది. నేను కూడా ఆమె నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ వస్తున్నా! ఇక మా అమ్మ ప్రతి బాధ్యతనూ ఎంతో దయతో నిర్వహించేది. అందుకే.. ఎన్నో విషయాల్లో నాకు స్ఫూర్తిదాయకంగా నిలిచింది" అంటూ చెప్పుకొచ్చింది.

Printer. Publisher and owned by Dr k Soumya, and printed it kalanjali offset printers, shop no.23, sowjanya complex, N.K road , Srinivas Nagar, nandyal-518501 shop no 7, Sai revenue complex, mro office complex, nandyal town -518501 nandyal district (AP) editor: Dr k Sowmya. Email: editor@dream Times.in, editor@dream Times.co.in, cell:8500066609,RNI NO:APTEL 2021/81831